ANN తెలుగు

Follow: @ANNTELUGU

03-02-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 38 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# భారత్ కు ట్రంప్ శుభవార్త

### టారిఫ్ లు 25 నుండి 18 శాతానికి తగ్గింపు
### ప్రదాని మోదీకి ఫోన్ కాల్ తర్వాత నిర్ణయం

**ఢిల్లీ, మహా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ ల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్ పై ఇంతకుముందు విధించిన ప్రతీకార టారిఫ్ లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ లో పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడిన అనంతరం ఈ ప్రకటన వెలువడడం ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్ తన ప్రకటనలో ఏమని పేర్కొన్నారంటే... "ఈ ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) భారత ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. మోదీ నా గొప్ప స్నేహితుల్లో ఒకరు. ఆయన భారత్ లో అత్యంత శక్తిమంతమైన నేత. మేం ఇవాళ ఫోన్ కాల్ లో చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు తదితర అంశాలు చర్చకు వచ్చాయి.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

భార్యాభర్తల సంభాషణలు విని దుశ్చర్యకు పాల్పడితే

### విచారణ జరపాలా వద్దా?

- మంత్రి శ్రీధర్ బాబు హాట్ కామెంట్స్



02

### జీవితాన్ని ప్రేమించండి

- నిరాశను ద్వేషించండి
- ఎంపీ ఈటల రాజేందర్ ఎమోషనల్ ట్వీట్



02

### బంగారం ధర మరింత క్రాష్

- తులం 1.34 లక్షలు
- మరింత తగ్గుతుందంటున్న నిపుణులు



02



## రాహుల్ వర్సెస్ రాజ్ నాథ్

**లోక్ సభలో రచ్చ**

**ఢిల్లీ, మహా:** లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటన సోమవారం తీవ్ర గందరగోళానికి కారణమైంది. సభలో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చలో పాల్గొంటూ, రాహుల్ గాంధీ తన ప్రసంగం ప్రారంభంలో చైనా ట్యాంకులు భారతదేశంలోకి ప్రవేశించాయని అన్నారు. రాహుల్ గాంధీ ఇలా చెప్పగానే... రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో హోం మంత్రి అమిత్ షా కూడా తన సీటు నుంచి లేచి

మిగతా 2లో



# మీరెట్ల జాతిపిత అయితరు?

## ప్రజలు తిరస్కరించినా.. తప్పుకోలే

కుటుంబం మొత్తానికి పదవులు.. వందల ఎకరాల ఫామ్ హౌజ్ లు ఎట్లొచ్చినయ్?

కోదండరాం తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేసింది మీ పాలనలో కాదా?

నేరం చేస్తే విచారణ చేయొద్దా? తప్పుచేస్తే చట్టం ముందు నిలబడాల్సిందే

నువ్వు బాత్రూంలో ఉన్నా రా.. అంటే సిట్ వచ్చి విచారించాల్నా?

బీఆర్ఎస్ నేతలపై తీవ్రంగా ఫైరయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మహా :**

"ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే తెలంగాణ జాతిపితకు ఇస్తారా అంటున్నారు.. ఉద్యమకారులను అవమానిస్తారా అని గగ్గోలు పెడుతున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించింది. వందల ఎకరాల ఫాంహౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? పదేళ్లలో బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. అలాంటి మీరు తెలంగాణ జాతిపిత ఎలా అవుతారు..? ఉద్యమకారులు ఎలా అవుతారు..? " అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో రావి నారాయణ రెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుందన్నారు. ప్రజల్లో చైతన్యం నింపిన వారే గొప్ప నాయకులు అవుతారని చెప్పారు. రావి నారాయణరెడ్డికి సముచిత గౌరవం ఇవ్వడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

మిగతా 2లో





## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు

రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం అత్యంత ముఖ్యమైనదిగా భావిస్తానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎన్నో అవార్డులు వచ్చినప్పటికీ ఇది ఎంతో గొప్పదిగా ప్రత్యేక మైనదని తెలిపారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి కలిగిన వ్యక్తి అని, ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావులని కొనియాడారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ నేతలు చాడ వెంకటరెడ్డి, నారాయణ , పల్లా వెంకట రెడ్డి , అజీజ్ బాషా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్వీ సత్యనారాయణ, అమర వీరుల స్మారక ట్రస్టు కార్యదర్శి కంది మల్ల ప్రతాప్ రెడ్డి, సంగీత దర్శకుడు వందే మాతరం శ్రీనివాస్ హాజరయ్యారు.

## ఇక నుంచి 2 గంటల్లో హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు

### మూడు గంటల్లో హైదరాబాద్ నుండి చెన్నై
### హైస్పీడ్ కారిడార్లపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నుండి బెంగళూరుకు వెళ్లాలంటే 10 నుండి 12 గంటల సమయం పడుతుంది. అదే విమానంలో అయితే గంట నుండి గంటన్నర ప్రమాణమే. ఇంత తక్కువ సమయంలోనే రైలు ప్రయాణం కలను బుల్లెట్ ట్రైన్ తో కేంద్రం సాకారం చేస్తోంది.. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మూడు హైస్పీడ్ కారిడార్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ కారిడార్లపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడారు. ఇక నుంచి హైదరాబాద్, బెంగళూరు మధ్య ప్రయాణాలు సులభంగా ఉంటాయని అన్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కేవలం రెండు గంటల్లో చేరుకోవచ్చని చెప్పారు. హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని తెలిపారు. హైస్పీడ్ కారిడార్ పూర్తయ్యాక హైదరాబాద్ నుంచి చెన్నైకి 2.55 గంటల్లో చేరుకోవచ్చని అన్నారు. దీని వల్ల తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్, టూరిజం రంగాలు కూడా హైస్పీడ్‌లో అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు



తెలంగాణ, ఏపీకి గేమ్ చేంజర్ మారుతాయని వెల్లడించారు. బడ్జెట్‌లో తెలంగాణ రైల్వే రంగానికి రూ.5,454 కోట్లు కేటాయించినట్టు గుర్తుచేశారు.

**ఐటీ రంగానికి జోష్**

భారతదేశంలో ఐటీ పేరెత్తగానే ముందుగా గుర్తుకువచ్చేది బెంగళూరు, హైదరాబాద్ నగరాలే. ఈ రెండు దక్షిణాది

మిగతా 2లో



### తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-1 గనులు కేటాయించాం

**రాజ్యసభలో కిషన్ రెడ్డి**

**మహా:** తాడిచెర్ల 1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు

మిగతా 2లో

### ఎంజీ యూనివర్సిటీ లో విద్యార్థుల భోజనంలో గుట్కా ప్యాకెట్ కలకలం


హైవేపై ఏబీవీపీ భారీ రాస్తారోకో స్తంభించిన ట్రాఫిక్..

వీసీ తీరుపై విద్యార్థుల ఆగ్రహం మెయిన్ గేటు వద్ద గిన్నెలతో నిరసన..

**నల్లగొండ, మహా:** స్థానిక మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం (MGU) హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో గుట్కా ప్యాకెట్ ప్రత్యక్షం కావడం తీవ్ర కలకలం రేపింది. సోమవారం ఉదయం విద్యార్థులకు వడ్డించిన 'జీరా రైస్'లో గుట్కా ప్యాకెట్ రావడంతో విద్యార్థులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ

మిగతా 2లో





### అజిత్ పవార్ మృతిపై రాజకీయ దుమారం

- విమాన ప్రమాదంపై కాంగ్రెస్, శివసేన (యూబీటీ) అనుమానాలు
- చివరి నిమిషంలో పైలట్‌ను మార్చడంపై ప్రతిపక్షాల ప్రశ్నలు
- ఎన్సీపీ వర్గాల విలీనంపై ఒత్తిడి వల్లే ఇదంతా జరిగిందని ఆరోపణలు

**మహా:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటన అనూహ్య మలుపు తీసుకుంది. ఇది కేవలం ప్రమాదం కాదని, దీని వెనుక కుట్ర దాగి ఉందని ప్రతిపక్ష

మిగతా 2లో

## మా ఫోన్లు ట్యాపింగ్ చేసి.. మాపైనే కేసులు పెట్టారు

**బీజేపీ నేతల ఫోన్లనే కేసీఆర్ ప్రభుత్వంలో టార్గెట్ చేశారు**

**బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఫైర్**

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం కేసీఆర్ కు ఎందుకొచ్చిందంటూ బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఫైర్ అయ్యారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తుచేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## మునిసిపోల్స్‌పై సీఎం రేవంత్ నజర్

**నేడు ఇన్ ఛార్జి మంత్రులతో కీలక సమీక్ష**

**హైదరాబాద్, మహా:** విదేశీ పర్యటన ముగిసి నగరానికి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి పార్టీ, పాలనా వ్యవహారాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఆయన మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు జూబ్లీహిల్స్‌లోని పాత పార్లమెంట్ కార్యాలయంలో పార్లమెంట్ ఇంచార్జ్ మంత్రులతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, అభివృద్ధి పనులు, జిల్లాల వారీగా సంక్షేమ పథకాల అమలుపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లుగా తెలుస్తోంది. ఈ సమావేశానికి ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు.

## భారత్ లో జెన్ జీ ఆందోళనల సృష్టికి ప్రయత్నాలు

వివరాలు 4లో

## గుంటనక్కతో కాంగ్రెస్ ప్రభుత్వం మ్యాచ్ ఫిక్సింగ్

- బీఆర్ఎస్ రాచరిక పోకడలు
- ఫోన్ ట్యాపింగ్ విచారణ పారదర్శకంగా జరగాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు

02



## దేశానికి గాంధీ జాతిపిత.. రాష్ట్రానికి కేసీఆర్

**బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు**

**హైదరాబాద్, మహా:** దేశానికి గాంధీ ఏ విధంగా జాతిపిత అయ్యారో, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ కూడా ఈ రాష్ట్రానికి జాతిపితనే అని హరీశ్ రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని ఉద్దేశించి హరీశ్ రావు మాట్లాడుతూ.. జస్టిస్ సుదర్శన్ రెడ్డి విద్వేషపూరిత ప్రసంగాల వల్ల కలిగే నష్టాల గురించి హితబోధ చేసిన కొద్ది నిమిషాల్లోనే, అదే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని బయటపెట్టుకున్నారని ఆయన విమర్శించారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో తెలుసుకోవడానికి పుస్తకాలు చదవాల్సిన అవసరం లేదని, రేవంత్ రెడ్డి ప్రసంగాలు వింటే సరిపోతుందని అన్నారు.

మిగతా 2లో



## దేశానికి గాంధీ జాతిపిత.. రాష్ట్రానికి కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ పై రేవంత్ రెడ్డి తన కడుపులో ఉన్న కత్తులను, నోటిలోని విషాన్ని ప్రసంగం ద్వారా బయటపెట్టి తన అజీర్తిని, అక్కసును మరోసారి ప్రదర్శించారని హరీశ్ రావు అన్నారు. అమెరికా వెళ్లి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో నాలుగు రోజులు చదువుకున్నంత మాత్రాన రేవంత్ రెడ్డి తన పాత గుణాన్ని మార్చుకోలేదని హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటల్లో కనీస సంస్కారం లేదని, చిల్లర మాటలు, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆయన పేర్కొన్నారు.

## గుంటనక్కతో కాంగ్రెస్ ప్రభుత్వం మ్యాచ్ ఫిక్సింగ్

### బీఆర్ఎస్ రాచరిక పోకడలు

- ఫోన్ ట్యాపింగ్ విచారణ పారదర్శకంగా జరగాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసులో పారదర్శకంగా విచారణ జరగాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాచరిక పోకడలు అనుసరిస్తున్నదని.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పట్టించుకోవటం లేదని ఆరోపించారు. సోమవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని.. అందుకే ఆయనను విచారణకు పిలిచారని తెలిపారు. విచారణకు ఎవరిని పిలిచినా సరే వెళ్లాల్సిందేనని.. చట్టాలకు ఎవరూ అతీతం కాదని పేర్కొన్నారు. తాను తప్పు చేయకపోయినా ఈడీ, సీబీఐ విచారణకు వెళ్లానని.. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులో పిలిచినా వెళ్తానని స్పష్టం చేశారు. కానీ.. కేటీఆర్ మాత్రం కేసీఆర్‌ను అసలు విచారణకే పిలవద్దని అంటున్నారని.. ఇలాంటి రాచరిక పోకడల ఆలోచనలు మారకపోతే బీఆర్ఎస్‌ను ఎవరూ కాపాడలేరని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు సాగదీయకుండా విచారణను తుది దశకు తీసుకురావాలన్నారు. అదే విధంగా కేసీఆర్‌ను ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు పిలిచే పరిస్థితి ఎందుకు వచ్చిందో బీఆర్ఎస్ ఆలోచించుకోవాలని సూచించారు. గుంటనక్కతో కాంగ్రెస్ ప్రభుత్వం మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నదని.. అందుకే ఈ కేసులో విచారణ పూర్తి చేస్తారని తనకు నమ్మకం లేదని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల కోసమే కొన్ని రోజులు ఈ కేసును అటు, ఇటు తిప్పుతున్నారని.. నిజంగా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే రెండేళ్లుగా ఎందుకు కేసు ముందుకు పడటం లేదని ప్రశ్నించారు.

### హ్యాష్ ట్యాగ్ కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూ

ఏడీఐజీసీ సింగపూర్ గేట్ వే అనే సంస్థ డేటా సెంటర్ ద్వారా 67 వేల కోట్లు పెట్టుబడులు అన్నారని.. కానీ ఆ సంస్థకు కనీసం వెబ్ సైట్ కూడా లేదని కవిత అన్నారు. ఇన్ ఫ్రా కీ డేటా సెంటర్ పార్క్ అనే సంస్థ 70 వేల కోట్లు పెట్టుబడులు అని చెప్పారని.. ఈ కంపెనీని గతేడాది మేలో మాత్రమే పెట్టారని తెలిపారు. ఈ సంస్థ అమెరికాలో రూ.90 వేల కోట్లు, బ్రెజిల్ ప్రభుత్వంతో రూ.70 వేల కోట్లు ఎంవోయూ చేసుకున్నదని.. అంటే ఈ సంస్థ కేవలం ఎంఓయూల కోసమే పెట్టారా? లేదంటే బ్యాంక్‌లను మభ్య పెట్టే పనిచేస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇక బ్రూక్ ఫీల్డ్ యాక్సెస్ సంస్థ రూ.75 వేల కోట్లు పెట్టుబడి అన్నారని.. అదే సంస్థకు చెందిన మరొక సంస్థ రూ.25 వేల కోట్ల పెట్టుబడి అని చెప్పారని.. కానీ ఈ సంస్థ మార్కెట్ వ్యాల్యూ కన్నా కూడా చాలా ఎక్కువ పెట్టుబడులు పెడతామని చెప్పాయని తెలిపారు. ఇక కుందురూ జయవీర్‌రెడ్డి సంస్థ కూడా రూ.5,600 కోట్ల పెట్టుబడులు అన్నారని.. ఇది నిజమైన కంపెనేనా అనేది జయవీర్‌రెడ్డి చెప్పాల్సి ఉన్నదని వెల్లడించారు. ఉర్సా క్లస్టర్స్ అనే కంపెనీ 500 కోట్ల పెట్టుబడి పెడతామని ఎంవోయూ కుదుర్చుకున్న తర్వాత కంపెనీ పెట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూలను తెలంగాణ యువత ఎక్స్ పోజ్ చేయాల్సిన అవసరం ఉన్నదని పిలుపునిచ్చారు. లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. 'హ్యాష్ ట్యాగ్ కాంగ్రెస్ ఫేక్ ఎంవోయూ' పేరుతో తెలంగాణ యువత వీటిని బయట పెట్టాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. ఒకవేళ నిజంగానే పెట్టుబడులు వచ్చి ఉంటే వాటి వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చిన పెట్టుబడులతో ఎంత మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయో కూడా చెప్పాలని నిలదీశారు. తీసుకొచ్చిన పెట్టుబడుల ద్వారా ఎన్ని ఉద్యోగాలు కల్పిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఇక నుంచి ఇలాంటి అనేక అంశాలపై తాము ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

### భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే

## విచారణ జరపాలా వద్దా?

### మంత్రి శ్రీధర్ బాబు హాట్ కామెంట్స్

**మహా:** తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. వందల ఎకరాల ఫాంహౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకే వచ్చాయని, బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారని దుయ్యబట్టారు. మీరు జాతిపిత ఎలా అవుతారు? ఉద్యమకారులు ఎలా అవుతారు? అని నిలదీశారు. ప్రజలు తిరస్కరించినపుడు నాయకులు అర్థం చేసుకోవాలని, బీఆర్ఎస్ నేతలు ప్రజల తిరస్కారానికి గురయ్యారని హితవు పలికారు. ప్రజలే తప్పు చేశారని చెబితే ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య విలువలు గుర్తించి ప్రజాక్షేత్రం నుంచి తప్పుకుంటే గౌరవం నిలబడుతుందని, నేరాలు చేస్తాం. ప్రశ్నించవద్దని మీరెలా అంటారని ప్రశ్నించారు. అధికార దుర్వినియోగం చేసి వేల కోట్లు, వందల ఎకరాలు సంపాదించారని ఆరోపించారు. అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్య బద్ధంగా విచారణ తప్పదని స్పష్టం చేశారు. నేరాలను విచారించవద్దని ఎక్కడా లేదని, గతంలో శిబూసోరెన్ విచారణ ఎదుర్కోలేదా? లాలూ, జయలలిత, యడియూరప్ప విచారణ ఎదుర్కోలేదా? ప్రశ్నించారు.

**ఇది ఉద్యమకారుడి లక్షణం కాదు**

ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని, ఉద్యమకారులం అని వాళ్లే చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా అంటున్నారని, ఆనాడు గాంధీజీ పదవులు త్యాగం చేసి దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని, తెలంగాణ ఉద్యమం నడిపించిన ప్రొ.కోదండరామ్ ఉద్యమకారుడు కాదా? ప్రశ్నించారు. "తలుపులు బద్ధలు కొట్టి కోదండరామ్‌ను అరెస్టు చేసింది మీ పాలనలో కాదా?, అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా?" అని నిలదీశారు. పోలీసులు తలుపులు బద్ధలు కొట్టి కేసీఆర్‌ను తీసుకురాలేదు కదా అని అడిగారు. నోటీసులు ఇచ్చి కేసీఆర్‌ను విచారణకు పిలిచారని, రావి నారాయణరెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేల కోట్లు సంపాదించిన మీరు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలని హితవు పలికారు. హుందాగా తప్పుకుంటే కొంతైనా మీ గౌరవం నిలబడేదని అన్నారు. ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం, ఇదెక్కడి జాతిపిత లక్షణమని నిలదీశారు. అక్రమమార్గం ఎంచుకున్న వారు ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని వెల్లడించారు.

### తెలంగాణకు అప్పుడే

## తాడిచెర్ల-1 గనులు కేటాయించాం

### రాజ్యసభలో కిషన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 202627 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.

## ఓటీటీలో శంబాలా సరికొత్త రికార్డు

### ఆహాలో 11 రోజుల్లోనే 100 మిలియన్ల స్ట్రీమింగ్ నిమిషాలు




**మహా:** యంగ్ హీరో ఆది సాయికుమార్ నటించిన 'శంబాల' చిత్రం ఓటీటీలో సరికొత్త రికార్డు సృష్టించింది. థియేటర్లలో విజయం సాధించిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోనూ అద్భుతమైన ఆదరణ దక్కించుకుంటోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ 'ఆహా'లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం, కేవలం 11 రోజుల్లోనే 100 మిలియన్ల స్ట్రీమింగ్ నిమిషాలను పూర్తి చేసుకుని సత్తా చాటింది. యుగంధర్ ముని దర్శకత్వంలో తెరకెక్కిన 'శంబాల' గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైంది. అక్కడ మంచి స్పందన అందుకున్న తర్వాత, గత నెల 21న 'ఆహా'లో అందుబాటులోకి వచ్చింది. ఓటీటీలో విడుదలైన నాటి నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ క్రమంలోనే 100 మిలియన్ల స్ట్రీమింగ్ నిమిషాల మైలురాయిని చేరుకోవడంతో 'ఆహా' సంస్థ సోషల్ మీడియా ఎక్స్ ద్వారా ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసి ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది.

## ఇక నుంచి 2 గంటల్లో

### హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు

(మొదటిపేజీ తరువాయి)

నగరాలు ఐటీ రంగంలో అద్భుతాలు చేస్తున్నాయి. ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలైన మైక్రో సాఫ్ట్, గూగుల్ వంటివే కాదు ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టాటా కన్సల్టెన్సీ వంటి దేశీయ ఐటీ సంస్థలు కూడా ఈ రెండు నగరాల్లో కొలువై ఉన్నాయి. ఇలా ఐటీ హబ్ లుగా మారిన హైదరాబాద్, బెంగళూరు మధ్య ఐటీ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగుల రాకపోకలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇక ఇతర రంగాల్లోనూ హైదరాబాద్, బెంగళూరు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. ఇక తెలుగు, కన్నడ ప్రజల మధ్య విడదీయలేని సంబంధాలు ఉన్నాయి. దీంతో రాజకీయ, వ్యాపార, సినీ, ఇతర రంగాల ప్రముఖులతో పాటు ఐటీ ఉద్యోగులు, సామాన్యులు తరచూ హైదరాబాద్‌బెంగళూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటివారికి కేంద్రం గుడ్ న్యూస్ చెబుతోంది.

### ఎంజీ యూనివర్సిటీ లో విద్యార్థుల భోజనంలో

## గుట్కా ప్యాకెట్ కలకలం

### హైవేపై ఏబీవీపీ భారీ రాస్తారోకో స్తంభించిన ట్రాఫిక్..

### వీసీ తీరుపై విద్యార్థుల ఆగ్రహం మెయిన్ గేటు వద్ద గిన్నెలతో నిరసన..



(మొదటిపేజీ తరువాయి)

ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. గతంలోనూ పలు మార్లు అన్నంలో పురుగులు, క్రిమికీటకాలు వచ్చిన సంఘటనలు ఉన్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వైస్ ఛాన్సలర్ తీరు అత్యంత నిర్లక్ష్యంగా ఉందని ధ్వజమెత్తారు. "విద్యార్థుల ఆరోగ్యం కంటే అధికారులకు హాజరు శాతమే ముఖ్యమా?" అంటూ ఏబీవీపీ నాయకులు నిలదీశారు. భోజన గిన్నెలతో యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ప్రభుత్వానికి, వర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన ఉధృతం కావడంతో విద్యార్థులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు మూడు గంటల పాటు ఉద్రిక్తత కొనసాగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

**పోరాటం ఆగదు**

**- హనుమాన్ చారి, ఏబీవీపీ ఎంజీయూ అధ్యక్షుడు**

ఈ సందర్భంగా ఏబీవీపీ యూనివర్సిటీ అధ్యక్షుడు హనుమాన్ చారి మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే వరకు తమ నిరసన ఆగదని హెచ్చరించారు. పోలీసుల చొరవతో వైస్ ఛాన్సలర్ అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. హామీలు నెరవేర్చకపోతే మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఛత్రపతి, మోహన్, సుధీర్, అజయ్, సతీష్, శంకర్, సూర్య, విజయ్, వెంకటేష్, మౌనేష్ తదితరులు పాల్గొన్నారు.

### బంగారం ధర

## మరింత క్రాష్

### తులం 1.34 లక్షలు

### మరింత తగ్గుతుందంటున్న నిపుణులు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్, విజయవాడ సహా తెలుగు రాష్ట్రాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల (తులం) ధర సోమవారం ఉదయం రూ.8300 తగ్గి రూ. 1,38,900 లకు దిగిరాగా సాయంత్రానికి మొత్తంగా రూ.12300 క్షీణించి రూ.1,34,900లకు పడిపోయింది. ఇక 24 క్యారెట్ల పసిడి తులం ధర సోమవారం ఉదయం రూ.9050 తగ్గి రూ. 1,51,530 లకు తగ్గగా సాయంత్రానికి మరింత రూ.13410 పడిపోయి రూ.1,47,170లకు క్షీణించింది. వేగంగా మారిపోతున్న దేశీయ, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడిదారుల సెంటిమెంట్ మారుతుండటంతో బంగారం ధరల్లో ఈ స్థాయిలో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.

## కార్యకర్తలకే కమలం పెద్ద పీట

- 80 శాతం మంది కార్యకర్తలకే కార్పొరేటర్ టిక్కెట్లు
- సర్వే నివేదికల ఆధారంగా టిక్కెట్లు ఖరారు చేసిన త్రిసభ్య కమిటీ
- 66 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం

**కరీంనగర్, మహా:** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. మొత్తం 66 మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు విడుదల చేశారు. అభ్యర్థుల జాబితాను విశ్లేషిస్తే 80 శాతం మంది కార్యకర్తలకే టిక్కెట్లు దక్కాయి. ఇతర పార్టీల నుండి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని జరుగుతున్న ప్రచారమంతా ఒట్టిదేనని తేలిపోయింది. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకే ఈ సారి పెద్ద పీట వేయడం గమనార్హం. గెలిచే అవకాశం లేని డివిజన్లలో మాత్రమే ఇతర పార్టీల నుండి వచ్చిన మాజీ కార్పొరేటర్లకు, ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకులకు టిక్కెట్లను కేటాయించారు. టిక్కెట్ల కేటాయింపులో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎక్కడా జోక్యం చేసుకోలేదు. జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, కోమాల ఆంజనేయులు, ఓదేలు ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని నియమించారు. అదే సమయంలో ఎవరికి టిక్కెట్లు కేటాయించాలనే అంశంపై డివిజన్ల వారీగా సర్వేలు నిర్వహించారు. వివిధ సర్వే ఏజన్సీల ద్వారా వచ్చిన నివేదికలతోపాటు కార్యకర్తల పనితీరును పరిగణలోకి తీసుకుని గత వారం రోజుల నుండి డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసిన త్రిసభ్య కమిటీ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పంపింది. ఆ జాబితాను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు జాబితాను అధికారికంగా చేశారు.

### భార్యాభర్తల సంభాషణలు వినే

## దుశ్చర్యకు పాల్పడితే..

### విచారణ జరపాలా వద్దా?

### మంత్రి శ్రీధర్ బాబు హాట్ కామెంట్స్

**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియా వేదికగా ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

## అజిత్ పవార్ మృతిపై రాజకీయ దుమారం

### విమాన ప్రమాదంపై కాంగ్రెస్, శివసేన (యూబీటీ) అనుమానాలు

### చివరి నిమిషంలో పైలట్‌ను మార్చడంపై ప్రతిపక్షాల ప్రశ్నలు

### ఎన్సీపీ వర్గాల విలీనంపై ఒత్తిడి వల్లే ఇదంతా జరిగిందని ఆరోపణలు

కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీలు సంచలన ఆరోపణలు చేయడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని ఆ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేత విజయ్ వడేటివార్ మాట్లాడుతూ, "మహారాష్ట్రలో 80 శాతం మంది ప్రజలు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదానికి ముందు, చివరి నిమిషంలో పైలట్‌ను ఎందుకు మార్చారు? విమానంలో ఆరుగురు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం ఉంటే, ఐదు మృతదేహాలే ఎందుకు లభించాయి?" అని తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. కేవలం సీఐడీ విచారణతో నిజాలు బయటకు రావని, నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా ఇదే తరహా అనుమానాలు వ్యక్తం చేశారు. అజిత్ పవార్ తన వర్గాన్ని, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గాన్ని తిరిగి ఏకం చేసేందుకు ప్రయత్నించారని, ఈ కారణంగానే మహాకూటమిలో ఆయనపై తీవ్ర ఒత్తిడి వచ్చిందని ఆరోపించారు. ఇరిగేషన్ స్కాం ఫైళ్లను అడ్డం పెట్టుకుని బీజేపీ ఆయన్ను బెదిరించిందని అన్నారు. పార్టీలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్న కొద్ది రోజులకే ఆయన మరణించడం మిస్టరీగా ఉందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని రౌత్ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ నిరాధారమైనవని, ఒకరి మరణంపై రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూడటం దారుణమని బీజేపీ ఎమ్మెల్సీ చిత్ర వాఘ్ విమర్శించారు. అజిత్ పవార్‌పై పాలక కూటమి నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని ఆమె స్పష్టం చేశారు. కాగా, అజిత్ పవార్ బీజేపీని వీడటానికి సిద్ధమైన కొద్ది రోజులకే ఈ ప్రమాదం జరిగిందంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొలుత అనుమానాలు వ్యక్తం చేసింది.

### మా ఫోన్లు ట్యాపింగ్ చేసి..


## మాపైనే కేసులు పెట్టారు

(మొదటిపేజీ తరువాయి)

లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు.

## రాహుల్ వర్సెస్ రాజ్ నాథ్

### లోక్ సభలో రచ్చ



(మొదటిపేజీ తరువాయి)

నిలబడి రాహుల్ ఆరోపణలను, వాదనను తప్పు అని వివరించాడు. అయితే మాజీ ఆర్మీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవాణే ఒక పుస్తకం రాశారని రాహుల్ గాంధీ అన్నారు. అందులో చైనా చొరబాటు గురించి ఈ వాదన చేశారు. దీనిపై రక్షణ మంత్రి మాట్లాడుతూ అలాంటి పుస్తకం ఏదీ ప్రచురించలేదని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు సభను తప్పుదారి పట్టిస్తున్నారని రక్షణ మంత్రి అన్నారు. ఈ అంశంపై అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్ష నాయకుడిని పదే పదే అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ మనోజ్ నరవాణే పేరును పదే పదే ప్రస్తావించారు. రాహుల్ గాంధీ సభలో నరవాణే గురించి ప్రస్తావించినప్పుడల్లా అధికార పార్టీ సభ్యులు అభ్యంతరం చెప్పారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తన సీటు నుంచి చాలా సార్లు లేచి నిలబడ్డారు. అమిత్ షా కూడా చాలా సార్లు లేచి నిలబడి ప్రతిపక్ష సభ్యులను వాస్తవాలతో మాట్లాడాలని కోరారు. రాహుల్ ప్రసంగాన్ని పదేపదే అడ్డుకోవడానికి బిజెపి ప్రముఖులు ప్రయత్నించారు.

## దక్షిణాది రాష్ట్రాలకు పెరిగిన పన్ను వాటా

### 16వ ఆర్థికసంఘం సిఫార్సులు అమలు.. ఏపీ, తెలంగాణకు పెరిగిన నిధులు



**ఢిల్లీ, మహా:** మెరుగైన అభివృద్ధి ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు అధిక ఆదాయ సహకారాన్ని ఇవ్వాలంటూ దక్షిణాది రాష్ట్రాలు ఎప్పటి నుంచో వాదిస్తున్నాయి. అలాగే ఈ ఏడాది తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జీడీపీకి అధిక సహకారం (10 శాతం), విస్తీర్ణానికి తగిన పనితీరు (1520 శాతం) ఆధారంగా ప్రయోజనం కల్పించాలన్న 16వ ఆర్థిక సంఘం ప్రామాణికాల మేరకు ఈసారి దక్షిణాది రాష్ట్రాలకు పన్నుల వాటా పెంచారు. 16వ ఆర్థిక సంఘం సవరించిన ఈ సూత్రం దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడుల వాటాను భారీగా పెంచింది. అదే సమయంలో బిజెపి పాలిత హిందీ కేంద్ర రాష్ట్రాలు అయిన ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లకు కేటాయింపులను తగ్గించింది. ఈ కొత్త సూత్రం ఆరు ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది: జనాభా (17.5 శాతం), జనాభా పనితీరు (10 శాతం), రాష్ట్ర వైశాల్యం (10 శాతం), అటవీ విస్తీర్ణం (10 శాతం), తలసరి జిఎస్‌డిపి దూరం (42.5 శాతం), జిడిపికి సహకారం (10 శాతం). ఎవరెవరికి ఎలా? దీని కింద, 15వ ఆర్థిక సంఘం కేటాయింపులతో పోలిస్తే, ఈసారి ఐదు దక్షిణాది రాష్ట్రాలు మొత్తం రూ.15.26 లక్షల కోట్ల నిధుల నుండి అదనంగా రూ.18,330 కోట్లు పొందుతున్నాయి. దీంతో తలసరి ఆదాయంలో కర్ణాటక వాటా 3.64% నుండి 4.13% (+ రూ. 7,387 కోట్లు)కి పెరిగింది. అలాగే కేరళ కోటా 1.92% నుండి 2.38% (+ రూ. 6,975 కోట్లు) పెరిగింది. ఆంధ్రప్రదేశ్ కోటా 4.04% నుండి 4.21% (+ రూ. 2,594 కోట్లు) పెరిగింది. తెలంగాణ కోటా 2.10% నుండి 2.17% (+ రూ. 1,099 కోట్లు)కి పెరిగింది. అలాగే తమిళనాడు కోటా 4.07% నుండి 4.09% (+ రూ. 274 కోట్లు) పెరిగింది. నష్టపోయిన రాష్ట్రాల్లో గోవా, సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, ఒడిశా, మేఘాలయ, బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్‌లతో పాటు మధ్యప్రదేశ్ కూడా ఉంది.

## భారత్ కు ట్రంప్ శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు మోదీ అంగీకరించారు. అమెరికా నుంచి, దాంతో పాటే వెనెజువెలా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. ఈ నిర్ణయం ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలుకుతుందని ఆశిస్తున్నాను. ప్రతి వారం వేలమంది చనిపోతున్న ఆ యుద్ధానికి ఈ నిర్ణయం చరమగీతం పాడుతుందని అనుకుంటున్నాను. మోదీతో స్నేహం, గౌరవం ఇవన్నీ కాకుండా... ఆయన విజ్ఞప్తి మేరకు అమెరికాభారత్ మధ్య వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపాం. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇప్పటివరకు అమల్లో ఉన్న 25 శాతం టారిఫ్ లు 18 శాతానికి తగ్గుతాయి. అదే సమయంలో భారత్ వైపు నుంచి కూడా టారిఫ్ లు తగ్గుతాయనుకుంటున్నాను. దాంతోపాటే, పూర్తి పన్ను రహిత వాణిజ్యానికి ద్వారాలు తెరుచుకుంటాయని ఆశిస్తున్నాను. అమెరికా తయారీ వస్తువుల కొనుగోలు పట్ల కట్టుబడి ఉంటారని ప్రధాని మోదీ మాటిచ్చారు. ఈ వాణిజ్యం దాదాపు 500 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చు.

## జీవితాన్ని ప్రేమించండి.. నిరాశను ద్వేషించండి

### ఎంపీ ఈటల రాజేందర్ ఎమోషనల్ ట్వీట్

**హైదరాబాద్, మహా :** ఇటీవల చర్లపల్లిఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన తల్లి, ఇంటర్ చదువుతున్న పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవడంపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను కలిచివేసింది. ఈ ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. సోమవారం ఎక్స్ వేదికగా ఎమోషనల్ ట్వీట్ చేశారు. 'కన్నతల్లి, కడుపున పుట్టిన బిడ్డల మరణం వర్ణించలేనంత మానసిక వేదనను కలిగించింది. ఈ 'అమ్మ రాజీనామా' సంఘటన సమాజం అంతరాత్మను కదిలించాలి, లేదంటే మన సామూహిక జీవన విధానానికే అర్థం లేకుండా పోతుంది' అని పేర్కొన్నారు. జీవితాన్ని ప్రేమించండి.. నిరాశను ద్వేషించండి అని ఈటల ప్రజలకు సూచించారు. మరణం దేనికీ పరిష్కారం కాదని, అది కేవలం ఒక తీరని శూన్యం మాత్రమేనని అన్నారు. కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, 'ఆత్మనిర్భరత'తో పోరాడదాం.. చుట్టూ ఉన్న పోరాట యోధులను స్ఫూర్తిగా తీసుకుందామని కోరారు. బ్రతుకు విలువ తెలుసుకుందాం.. ఆఖరి వరకు జీవిద్దాం.. అని పిలుపునిచ్చారు. బోడుప్పల్ నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన విజయశాంతి రెడ్డి (38) తన ఇద్దరు పిల్లలతో తనువు చాలించడం ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది.

# గోదావరి పుష్కరాలపై సమావేశం



**నిర్మల్, మహా:** రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా మండలాల వారిగా పుష్కర ఘాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాసర పుష్కర ఘాట్ వద్దకు పుష్కరాల స్నానాలు ఆచరించే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి పుష్కర ఘాటు వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ఆయా మండలాల వారీగా రెవెన్యూ, వివిధ విభాగాల ఇంజనీరింగ్, పోలీసు, విద్యుత్, శాఖల అధికారులు లు వెంటనే పుష్కర ఘాట్లను సందర్శించి, అక్కడ అవసరమైన ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. అన్ని పుష్కర ఘాట్ ల వద్ద అవసరమైన పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. భక్తుల కొరకు దుస్తులు మార్చుకునే గదులు, త్రాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పుష్కర ఘాటు వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు, దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుష్కర ఘాట్ల వరకు అవసరమైన రోడ్డు సదుపాయం కల్పించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు మెరుగైన పారిశుద్ధ్యం కొనసాగించాలని వివరించారు. పుష్కర ఘాట్ల పరిసర ప్రాంతాలలో వంగిన, పాడైన విద్యుత్ స్తంభాలను మార్చాలని పేర్కొన్నారు. మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో, పుష్కర ఘాట్ ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులను అంచనా వేస్తూ దానికి అనుగుణంగా సంబంధించిన మౌలిక సదుపాయాలను కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు ఎస్పీ ఉపేంద్రా రెడ్డి, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండలో 'సింహం' గర్జన 18వ డివిజన్‌లో మారుతున్న సీన్!

- కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీరాణికి పెరుగుతున్న మద్దతు..
- బరిలో నుంచి తప్పుకుని మద్దతు ప్రకటించిన చిగుర్ల లలిత సురేష్..
- తాజా మాజీ కౌన్సిలర్ తీరుపై ఓటర్ల 'ఆగ్రహం' వసూళ్ల పర్వంపై చర్చ..
- కార్పొరేషన్‌లో సగానికి పైగా డివిజన్లలో ఏఐఎఫ్‌బీ అభ్యర్థులే..



**నల్గొండ మహా :** నల్గొండ కార్పొరేషన్ ఎన్నికల రాజకీయం రసవత్తరంగా మారుతుంది. ప్రధాన పార్టీల టికెట్ రాజకీయం తెచ్చిన తలనొప్పులు ఇప్పుడు ఆయా పార్టీల అభ్యర్థులకు కొంప ముంచేలా ఉన్నాయి. ముఖ్యంగా 18వ డివిజన్‌లో సమీకరణాలు శరవేగంగా మారిపోతున్నాయి. ఇక్కడ సింహం గుర్తుపై పోటీ చేస్తున్న కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీరాణి నాగరత్నం రాజు గెలుపు ఖాయమనే ధీమా ఓటర్లలో వ్యక్తమవుతోంది. ఈ డివిజన్ రాజకీయాల్లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. కార్పొరేటర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చిగుర్ల లలిత సురేష్, చివరి నిమిషంలో తన నామినేషన్‌ను ఉపసంహరించుకుని ఆలకుంట్ల ఝాన్సీరాణి దంపతులకు బేషరతుగా మద్దతు ప్రకటించారు. సింహం గుర్తుపై ఓటు వేసి ఝాన్సీరాణిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కాలనీ వాసులకు పిలుపునివ్వడం ఇక్కడ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా ఝాన్సీరాణి దంపతులు లలిత సురేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. "నేను మీ నాయకురాలిని కాదు.. సేవకురాలిని" అంటూ ఆమె చేస్తున్న ఇంటింటి ప్రచారానికి కాలనీ వాసులు బ్రహ్మరథం పడుతున్నారు.

**తాజా మాజీ కౌన్సిలర్ భర్త వసూళ్ల పర్వం..!**

మరోవైపు, 18వ డివిజన్ తాజా మాజీ కాంగ్రెస్ కౌన్సిలర్ తీరుపై స్థానిక ఓటర్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. నల్లా కనెక్షన్ల నుంచి ఇంటి పర్మిషన్లు, హౌస్ నంబర్ల వరకు ప్రతి దానికీ ఒక రేటు ఫిక్స్ చేసి తన భర్త ద్వారా వసూళ్లకు పాల్పడ్డారని డివిజన్ వాసులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల కబ్జాదారులు, రౌడీషీటర్లు, గంజాయి ముఠాలకు కొమ్ముకాస్తూ సామాన్యులను ఇబ్బంది పెట్టిన వారికి ఈసారి ఓటుతో బుద్ధి చెబుతామని ఓటర్లు తెగేసి చెబుతున్నారు.

**జిల్లా వ్యాప్తంగా 'సింహం' క్రేజ్.. జాగృతితో దోస్తీ!**

నల్గొండ కార్పొరేషన్‌లో మొత్తం 48 డివిజన్లలో సగానికి పైగా అభ్యర్థులు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (AIFB) పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపైనే పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల నాయకులు బుజ్జగించినా లొంగని రెబల్స్ అంతా ఇప్పుడు ఈ గుర్తునే ఆశ్రయించారు. కల్వకుంట్ల కవితకు చెందిన 'జాగృతి' సంస్థ ఏఐఎఫ్‌బీతో పొత్తు పెట్టుకోవడంతో ఈ గుర్తుకు మరింత క్రేజ్ పెరిగింది. ఏది ఏమైనా, 18వ డివిజన్‌తో పాటు నల్గొండలోని పలు చోట్ల 'సింహం' గర్జన స్పష్టంగా కనిపిస్తోంది.

## దంతూరి అంజమ్మ మరణం తీరనిలోటు

**వలిగొండ, మహా :**వలిగొండ మండలం దాసిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన రామన్నపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య తల్లి దశదినకర్మకు సోమవారంహాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించిన వలిగొండ మాజీ జడ్పిటిసి మొగుళ్ళ శ్రీనివాస్ మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ లు మాట్లాడుతూ దంతూరి అంజమ్మ మరణం వారి కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొన్నారు కార్యక్రమంలో కుటుంబ సభ్యులు దంతూరి సత్తయ్య దంతూరి రాములు దంతూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు



## రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ బాలికల జట్టుకు ఎంపికైన విద్యార్థి బెల్లంపల్లి

**మహా:** రాష్ట్ర సభ్యునిగా బాలికల వాలీబాల్ జట్టుకు తాండూరు మండలంలోని అచ్చులాపూర్ గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం. అమూల్య ఎంపికైనట్లు పీడీ ఏ.సాంబమూర్తి తెలిపారు. ఈనెల 1వ తేదీనఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్జూనియర్ బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు జడ్.పి.హెచ్.ఎస్ బాలుర ఉన్నత పాఠశాల మంచిర్యాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది.ఈ ఎంపిక పోటీలలో 9వ తరగతి చదువుతున్న అమూల్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ నెల 05నుండి 08 వ తేదీ వరకు వరకు నిజాంబాద్ జిల్లా లోని కుమ్మరపల్లి మండలంలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలలో పాల్గొననుంది.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనటువంటి అమూల్యని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి ఉమాదేవి, పాఠశాల ఏఏపిసి చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు.

# ల్యాబ్ టెక్నీషియన్లు వృత్తి నైపుణ్యం నిర్వహించాలి

- 71 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ పూర్తి
- మలేరియా, డెంగ్యూ, చికెన్, గున్యా,క్యాయ వ్యాధుల పట్ల అవగాహన కలిగించాలి



**మంచిర్యాల, మహా :** ల్యాబ్ టెక్నీషియన్లు వృత్తి నైపుణ్యం సమర్థవంతంగా నిర్వహించాలని ఉప జిల్లా ఆరోగ్యశాఖ వైద్యాధికారి సుధాకర్ నాయక్ అన్నారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కొత్తగా నియమించిన 71 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ల్యాబ్ టెక్నీషియన్లు నిర్వర్తించవలసిన విధులు సమయపాలన పాటించాలని కోరారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ కు పంపించే రక్త నమూనాలను సరైన సమయంలో సరియైన మోతాదులో తీసుకుని ఆయా వివరములను రిజిస్టర్, ఆన్లైన్ హోటల్లో నమోదు చేయడమే కాకుండా రోగి వివరములను అడ్రస్సును రోగి మొబైల్ నెంబర్ ను తీసుకోవాలని అన్నారు.అదేవిధంగా బార్కోడ్ ను సక్రమంగా డిపార్ట్మెంట్ వారిగా నమోదు చేసి శాంపిల్స్ అన్నిసరి అయిన సమయంలో ఏపీలో నమోదైన కేసుల శాంపులను తీసుకొనడం బార్కోడింగును సక్రమంగా నమోదు చేసి టీ హబ్ పంపించాలని వెల్లడించారు. సాయంత్రం వరకు రోగి వైద్యునికి వాట్సప్ ద్వారా వివరములు అందించబడతాయని చెప్పారు.తద్వారా వైద్యుడు రాసిన పరీక్షలు మాత్రమే రాయాలని ఆదేశించారు. దీనివల్ల రోగికి ఎలాంటి అవసరం ఉందో తెలుస్తుందని చెప్పారు. ల్యాబ్ టెక్నీషియన్లు రిజిస్టర్లు మెయింటైన్ చేయడం బయో వేస్టేజ్ పదార్థాలను సక్రమంగా డిస్పోస్ చేయాలని వివరించారు. అదేవిధంగా రాపిడ్ డయాగ్నొస్టిక్ కిట్టులను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. మలేరియా డెంగ్యూ లాంటి కిట్టులు గర్భవతి పరీక్షలకిట్టులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు వాటి వివరములను తెలుసుకోని ల్యాబ్ టెక్నీషియన్లు తమ ల్యాబ్ రూములో చేయుచున్న పరీక్షల వివరములను గోడ పైన అతికించాలని చెప్పారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి లో గర్భవతులకు పరీక్షలు సికిల్ సెల్ రక్తనమోనాలు అదేవిధంగా మలేరియా డెంగ్యూ చికెన్ గునియా ఫైలేరియా క్షయ నియంత్రణలో భాగంగా చేయవలసిన పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీ హబ్ మేనేజర్ వెంకటేష్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, సిహెచ్ ఓలు వెంకటేశ్వర్లు నామ్దేవ్ సబినిటీ అధికారులు శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేషన్ అల్లాడి శ్రీనివాస్ డి పి హెచ్ ఎన్ పద్మ మార్తలతో పాటు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



## రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గుర్రంపోడు ఆర్ఐ..

**నల్లగొండ, మహా:** నల్లగొండ జిల్లాలో అవినీతి తిమింగలాలపై ఏసీబీ అధికారులు మరోసారి పంజా విసిరారు. గుర్రంపోడు మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం జరిపిన ఆకస్మిక దాడిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) మహమ్మద్ అబ్దుల్ హకీమ్ రూ. 20,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.ఘటన వివరాల్లోకి వెళ్తే..ఒక బాధితుడికి సంబంధించిన సర్వే నంబర్ 225/6లోని 1.15 ఎకరాల భూమి వివరాలు ఆన్‌లైన్ 1బి రిజిస్టర్ (ROR) నుండి తొలగించబడ్డాయి. వాటిని పునరుద్ధరించడం కోసం బాధితుడు రెవెన్యూ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. ఈ పనులను పూర్తి చేసి, ఫైల్‌ను తహసీల్దార్‌కు పంపేందుకు ఆర్ఐ అబ్దుల్ హకీమ్ రూ. 20,000 లంచం డిమాండ్ చేశారు.బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, వారి సూచన మేరకు సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆర్ఐకి నగదు అందజేస్తుండగా అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ. 20,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. తన విధులను నిజాయితీగా నిర్వర్తించకుండా, అక్రమ ప్రయోజనం పొందడానికి ప్రయత్నించినందుకు గాను ఆర్ఐని అరెస్టు చేశారు. అనంతరం అతడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు.అవినీతిని అంతం చేద్దాం ఏసీబీ పిలుపు... ప్రభుత్వ ఉద్యోగులెవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. టోల్ఫ్రీనంబర్1064, వాట్సాప్ నంబర్ 9440446106 కి సోషల్ మిడియా @TelanganaACB (X/Facebook)ల వివరాలు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉంది. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, అవినీతి రహిత సమాజం కోసం ప్రజలు భాగస్వాములు కావాలని ఏసీబీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## మున్సిపల్ ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి..

**శిక్షణలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం**



**నల్గొండ,మహా:** మున్సిపల్ ఎన్నికల విధులను ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ) అత్యంత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని ఉదయాదిత్య భవనంలో పీఓ, ఏపీఓలకు ఏర్పాటు చేసిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**నిబంధనలపై అవగాహన అవసరం..**

ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఘట్టాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఇచ్చే ఎన్నికల మెటీరియల్‌ను సరిచూసుకోవాలి. ఏజెంట్ల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను తెరవడం, సీలింగ్ చేయడం వంటి ప్రక్రియలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలి.పీఓ డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్‌ను పక్కాగా నమోదు చేయాలి. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభించాలని, ఓటర్లను గుంపులుగా కాకుండా క్యూ పద్ధతిలో క్రమశిక్షణతో అనుమతించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని 'టీ పోల్' యాప్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలి. పోలింగ్ కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్లు, వాటర్ బాటిళ్లు, బ్యాగులు, ఇంకు ప్యాడ్లు వంటి వాటిని అనుమతించకూడదు. కేంద్రం లోపలికి మీడియా ప్రతినిధులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల వద్ద మెడికల్ టీమ్స్, వీల్ చైర్లు అందుబాటులో ఉంటాయని, అంగన్‌వాడీ సహాయకులు సహకరిస్తారని తెలిపారు. వాహనాలను కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల జిల్లా పరిశీలకులు, రాష్ట్ర ఎస్సీఈఆర్టీ సంచాలకులు జి. రమేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డీఈఓ భిక్షపతి, శిక్షణ నోడల్ అధికారి ద్వారక్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ పోరు హీటెక్కింది

- 28 వార్డుల్లో కాంగ్రెస్–బీజేపీ –బీఆర్ఎస్ త్రికోణ సమరం
- ఇంటింటా ప్రచారంతో పట్టణం రాజకీయ రంగు...


**వేములవాడ మహా:**వేములవాడ మున్సిపాలిటీలో ఎన్నికల సమరం రోజురోజుకీ ఉధృతమవుతోంది. పట్టణంలో ఉన్న 28 వార్డుల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది.గెలుపే లక్ష్యంగా మూడు పార్టీలు ప్రచారాన్ని పీక్ స్టేజ్‌కు తీసుకెళ్లాయి. ఎన్నడు పలకరించే నీ వాడు సైతం అవ్వ బాగున్నావా...?, అన్నా బాగున్నావా ..? పంపి బాగున్నావా...? అని పలకరింపులు జోరందుకున్నాయి. పోటీలో నిలబడే అభ్యర్థులు ఓటర్ల జాబితా తీసుకొని మరి వార్డులలో పాదయాత్రలు చేసి గడపగడప ప్రచారం నిర్వహిస్తున్నారు.

**ఇంటింటి ప్రచారంతో పట్టణమంతా రాజకీయ రంగు**

అభ్యర్థులు కాలనీలు, బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అభివృద్ధి హామీలు, వార్డు సమస్యలే ప్రచారంలో ప్రధాన అస్త్రాలుగా మారాయి.

**అధికారాన్ని కాపాడుకునే ప్రయత్నంలో బీఆర్ఎస్**

మున్సిపాలిటీలో ఆధిపత్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. చేపట్టిన అభివృద్ధి పనులే తమ బలమని పార్టీ చెబుతోంది.



**ప్రభుత్వ బలంతో కాంగ్రెస్ ప్రచారం**

రాష్ట్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ముందుంచుతూ మున్సిపల్ పాలనలో మార్పు అవసరమని ప్రజలకు వివరిస్తోంది. మున్సిపల్ పాలనలో మార్పు అవసరమని ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందిస్తామని కాంగ్రెస్ నేతలు ఓటర్లకు హామీలు ఇస్తున్నారు.

**ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ దూకుడు**

బీజేపీ పార్టీ యువత,పట్టణ మధ్యతరగతి ఓటర్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ప్రచారాన్ని విస్తృతం చేసింది. అవినీతి లేని పాలననే తమ నినాదంగా ప్రచారం సాగుతోంది.ఫలితాలను తేల్చే కీలక వార్డులు28 వార్డుల్లో కొన్ని వార్డులు హాట్ సీట్లుగా మారాయి.ఈ వార్డుల ఫలితాలే మున్సిపల్ పాలన దిశను నిర్ణయించనున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**ఉత్కంఠగా మారిన ఎన్నికలు**

మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీతో వేములవాడ మున్సిపల్ ఎన్నికలు ఉత్కంఠభరితంగా మారాయి.



## 11 వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా...

**కౌన్సిలర్ అభ్యర్థి వైద్యం గోపి ప్రియాంక పవన్ కుమార్**

**సంగారెడ్డి ప్రతినిధి, మహా :**వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కౌన్సిలర్ అభ్యర్థి వైద్యం గోపి ప్రియాంక పవన్ కుమార్ అన్నారు .సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధితోపాటుపేదల సంక్షేమం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే సాధ్యమన్నారు. ఈ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే వార్డ్ జలకు ఎల్లవేళలా అండగా ఉండి. టిపిసిసి జగ్గారెడ్డి. టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి సహాయ సహకారాలతో వార్డులోని అన్ని సమస్యలను తీరుస్తానని. జరగనున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో భారీ మెజార్టీ తో గెలిపించాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

# అభ్యంతరాల పరిష్కారంలో నిబంధనలు పాటించాలి

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** 2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్లపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం చెన్నూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్లపై అందిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూర్ మునిసిపాలిటీలో 18 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నామినేషన్లపై అందిన దరఖాస్తులను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిష్కరించి అర్హులైన అభ్యర్థుల జాబితా తయారు చేయాలని మా సిబ్బంది ఆదేశించినట్లు అన్నారు. 3 ఫిబ్రవరి నాడు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో తదిత ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

## కరీంనగర్ జిల్లాలో సీఎం రేవంత్ పర్యటన..

**కరీంనగర్ మహా :** ఈ నెల 5వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కరీంనగర్ జిల్లా పర్యటనను పురస్కరించుకుని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ సభా ప్రాంగణం, హెలిపాడ్ పార్కింగ్ స్థలాలను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.బారికేడ్ల ఏర్పాటు: సభా ప్రాంగణ మ్యాప్ ఆధారంగా భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, బారికేడ్ల నిర్మాణ శైలిని సీపీ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్టమైన బారికేడ్ విధానాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించాలి

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**కరీంనగర్ మహా :** ప్రజా సంక్షేమం లక్ష్యంగా, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. సోమవారం కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ లో కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి తరపున ఆయన ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పలకరించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పాటుపడుతున్నదని చెప్పారు. గత పాలకులు అభివృద్ధిని విస్మరిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి ఏమిటో చేసి చూపించిందన్నారు.అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గోపు మల్లారెడ్డి గురించి తెలియని వారు ఈ డివిజన్ లో ఉండరని, మల్లారెడ్డిని గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు.

## అభివృద్ధి కాంగ్రెస్ కే సాధ్యం

**14వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాయిపాడు స్వరూప రమేష్**

**సంగారెడ్డి ప్రతినిధి : మహా:** అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకే సాధ్యం అని 14వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాయిపాడు స్వరూప రమేష్ సోమవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూజరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉండి తమ వంతు నిస్వార్థ సేవలు అందిస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగమేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్ గౌడ్ , రేండ్లపల్లి సర్పంచ్ బలరాం శ్రీనివాస్ , వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నన్ను ఆదరించి గెలిపిస్తే 22వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తా..

**స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి గారెల గౌరీదేవి తుల్జారాం**



**సంగారెడ్డి ప్రతినిధి : మహా :**పట్టణంలోని 22వ వార్డు ప్రజలు నన్ను ఆదరించి గెలిపిస్తే వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి గారెల గౌరీదేవి తుల్జరం సోమవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉండి తమ వంతు సేవలందిస్తామన్నారు.జరుగనున్న ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.కార్యక్రమంలో వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సదాశివపేటలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులు



**సంగారెడ్డి ప్రతినిధి: మహా :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు 24 గంటల పాటు ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. సదాశివపేట సీఐ వెంకటేష్ ఆదేశాలతో ఎస్సైలు నాగేష్,పెంటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుండి సదాశివపేట పట్టణ హైవే కూడలిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకెళ్లకూడదని అలా తీసుకెళ్తే దానికి సంబంధించిన లెక్కలు కచ్చితంగా ఉండాలన్నారు. లేనిపక్షంలో నగదు సీజ్ చేస్తామన్నారు, మద్యం సరఫరా చేసే బెల్టు షాపులపై నిఘా పెట్టారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్,కానిస్టేబుల్ రాము, భూపతి రాజు తనిఖీలలో పాల్గొన్నారు.

# బిజెపి కార్పొరేటర్ అభ్యర్థుల ప్రకటన..

**కరీంనగర్ మహా :** కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. 66 డివిజన్లకు సంబంధించిన జాబితాకు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు ఆమోదం తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ లో తొలి సారిగా బీజేపీ అన్ని డివిజన్లలో అభ్యర్థులను బరిలో నిలుపుతుండడం విశేషం. గతంలో పట్టున్న ప్రాంతాలు, పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన అభ్యర్థులకు అవకాశం ఇచ్చినా బీజేపీ పరిమిత ప్రాంతాల్లోనే ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసింది. అయితే ఈ సారి మాత్రం కరీంనగర్ బల్దియాలోని 66 డివిజన్లలోనూ అభ్యర్థులను బరిలో నిలుపుతుండడం గమనార్హం. ముఖ్యంగా ఈ సారి మైనార్టీలు కూడా ఎక్కువ మంది బీజేపీ తరుపున పోటీ చేసేందుకు ముందుకు రావడంతో వారిని కూడా పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. గతంలో ఒకటి రెండు ప్రాంతాల్లో మాత్రమే మైనార్టీ అభ్యర్థులను బరిలో నిలపింది. కానీ ఈ సారి మాత్రం ఎక్కువ మందికి అవకాశం ఇవ్వడం విశేషం.

**డివిజన్ల వారీగా బీజేపీ ప్రకటించిన వివరాలు ఇలా ఉన్నాయి.**

వార్డు నెం – అభ్యర్థి పేరు (రిజర్వేషన్)
వార్డు 1 – బారి అపర్ణ (బీసీ–మహిళ)
వార్డు 2 – కొలగాని శ్రీనివాస్ (జనరల్)
వార్డు 3 – సాధినేని లావణ్య (జనరల్–మహిళ)
వార్డు 4 – భూపతి రవీందర్ (ఎస్సీ–జనరల్)
వార్డు 5 – చిందం హారిక (బీసీ–మహిళ)
వార్డు 6 – మేకల వెంకటేష్ (జనరల్)
వార్డు 7 – వాడే రమాదేవి (జనరల్–మహిళ)
వార్డు 8 – థోర్తి సంతోష్ (జనరల్)
వార్డు 9 – బండారి గాయత్రి దేవి (జనరల్–మహిళ)
వార్డు 10 – దేశవేని శంకర్ (బీసీ–జనరల్)
వార్డు 11 – పాండుగ స్వప్న (జనరల్–మహిళ)
వార్డు 12 – చొప్పరి జయశ్రీ (జనరల్–మహిళ)
వార్డు 13 – రెడ్డవేన లావణ్య (జనరల్–మహిళ)
వార్డు 14 – గుంజేటి శివకుమార్ (బీసీ–జనరల్)
వార్డు 15 – సోమిరెడ్డి కరుణ (జనరల్–మహిళ)
వార్డు 16 – గిత్త రాజేంద్ర ప్రసాద్ (జనరల్)
వార్డు 17 – గుంటి రమ్య (బీసీ–మహిళ)
వార్డు 18 – వాసాల రమేష్ (జనరల్)
వార్డు 19 – మూల రుక్మిణి (జనరల్–మహిళ)
వార్డు 20 – జాడి బాలరెడ్డి (ఎస్సీ–జనరల్)
వార్డు 21 – కొండపల్లి సతీష్ (జనరల్)
వార్డు 22 – బండా రమణా రెడ్డి (జనరల్)
వార్డు 23 – పదం శివరాజ్ (జనరల్)
వార్డు 24 – వొంతెల సత్యనారాయణ రెడ్డి (జనరల్)
వార్డు 25 – కాటకం లోకేష్ (ఎస్సీ–జనరల్)
వార్డు 26 – పుల్లెల పవన్ కుమార్ (జనరల్)
వార్డు 27 – తంబాల నవ్యశ్రీ (ఎస్సీ–మహిళ)
వార్డు 28 – కుర్ర రాజేశం (ఎస్టీ–జనరల్)
వార్డు 29 – సోమిడి వేణు (ఎస్సీ–జనరల్)
వార్డు 30 – నక్క సరితా శుభాషిణి (ఎస్సీ–మహిళ)
వార్డు 31 – ఎం.డి. ఫయాజుద్దీన్ (బీసీ–జనరల్)
వార్డు 32 – ఎం.డి. ఇనాయత్ అలీ (బీసీ–జనరల్)
వార్డు 33 – మదిశెట్టి సరిత (బీసీ–మహిళ)
వార్డు 34 – యేలగందుల నందకుమార్ (బీసీ–జనరల్)
వార్డు 35 – సదావేని సుజాత (బీసీ–మహిళ)
వార్డు 36 – థోట అనిల్ (బీసీ–జనరల్)
వార్డు 37 – కొడూరి ఎ.పి.పి. చంద్ర (బీసీ–జనరల్)
వార్డు 38 – దేవసాని సరస్వతి (జనరల్–మహిళ)
వార్డు 39 – పసుపులేటి శివానందం (బీసీ–జనరల్)
వార్డు 40 – కాసర్ల లక్ష్మీ నర్సవ్వ (జనరల్–మహిళ)
వార్డు 41 – వెనంక రేణుక (జనరల్–మహిళ)
వార్డు 42 – యాదగిరి సునీ రావు (జనరల్)
వార్డు 43 – పొన్నం లక్ష్మి (బీసీ–మహిళ)
వార్డు 44 – బండి తార (జనరల్–మహిళ)
వార్డు 45 – గడప విజయలక్ష్మి (బీసీ–మహిళ)
వార్డు 46 – కొడూరి అఖిల్ గౌడ్ (బీసీ–జనరల్)
వార్డు 47 – గాజా రమ (బీసీ–మహిళ)
వార్డు 48 – కర్ర పద్మ (బీసీ–మహిళ)
వార్డు 49 – అన్నం లక్ష్మి (జనరల్–మహిళ)
వార్డు 50 – బోయినపల్లి ప్రవీణ్ రావు (జనరల్)
వార్డు 51 – బండారి వేణు (జనరల్)
వార్డు 52 – నేదునూరి కనకలక్ష్మి (జనరల్–మహిళ)
వార్డు 53 – కొంపెల్లి శ్వేత (ఎస్సీ–మహిళ)
వార్డు 54 –గొట్టిముక్కల ఉమారాణి (బీసీ–మహిళ)
వార్డు 55 – గుగ్గిల్లపు మంజుల (జనరల్–మహిళ)
వార్డు 56 – తాటి ప్రభావతి (జనరల్–మహిళ)
వార్డు 57 – కొలిపాక రమ్యశ్రీ (జనరల్–మహిళ)
వార్డు 58 – సర్దార్ బల్బీర్ సింగ్ (బీసీ–జనరల్)
వార్డు 59 – ఎం.డి. సమీ పర్వేజ్ (బీసీ–జనరల్)
వార్డు 60 – టి. శ్రీదేవి (జనరల్–మహిళ)
వార్డు 61 – సయ్యద్ రిజ్వానా (బీసీ–జనరల్)
వార్డు 62 – పెద్దపల్లి శ్రీలేఖ (బీసీ–మహిళ)
వార్డు 63 – దేశా శిల్ప (బీసీ–జనరల్)
వార్డు 64 – గాడే శ్రీకళ (బీసీ–మహిళ)
వార్డు 65 – కామటం తిరుపతి (జనరల్)
వార్డు 66 – వంగల పవన్ (జనరల్)

# భారత్‌లో జెన్ జీ ఆందోళనల సృష్టికి ప్రయత్నాలు

## సుప్రీంకోర్టుకు సంచలన విషయాలు చెప్పిన కేంద్రం




(మహా డెస్క్)

భారత్ లోనూ జెన్ జీ ఆందోళనలకు ప్రణాళికలు జరిగాయా? దేశంలో అస్థిరతకు కుట్ర జరిగిందా? కేంద్రం సుప్రీంకోర్టుకు ఓ సంచలన విషయం చెప్పింది. నేపాల్ , బంగ్లాదేశ్‌లో మాదిరిగా భారత్‌లో జెన్ జీ ఆందోళనలు సృష్టించేందుకు ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ ప్రయత్నించారని సుప్రీం కోర్టుకు చెప్పింది కేంద్రం. అరబ్ దేశాల్లోని బహుళ ప్రభుత్వాలను కూల్చివేసేందుకు దారితీసిన 'అరబ్ స్ప్రింగ్స్' వంటి ఆందోళనను కూడా వాంగ్‌చుక్ ప్రస్తావించారని కేంద్రం, లద్ధాఖ్ కేంద్రపాలిత ప్రాంతం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. ప్రస్తుతం జైలులో శిక్ష అనుభవిస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టును వ్యతిరేకిస్తూ భార్య గీతాంజలి జె ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ కోర్టుకు ప్రభుత్వ స్పందనను చెప్పారు. "వాంగ్‌చుక్ కేంద్ర ప్రభుత్వాన్ని 'వారు' అని పేర్కొన్నారు. లద్ధాఖ్ ప్రజలను 'మేము' అంటూ వేరు చేసి ప్రజాభిప్రాయ సేకరణకు పిలుపునిచ్చారు. ఇలా వాంగ్‌చుక్ చేసిన ప్రసంగాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోవాలి. అతడు యువతను తప్పుదారి పట్టిస్తున్నాడు. దానిని కవర్ చేయడానికి మహాత్మా గాంధీ ప్రసంగాలను జాగ్రత్తగా ఉపయోగిస్తున్నాడు. అయితే, గాంధీజీ ఎప్పుడూ ప్రజలను వారి స్వంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టలేదు. సరిహద్దులను కాపాడే భద్రతా దళాలకు లద్ధాఖ్ చాలా ముఖ్యమైనది" అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు చెప్పారు. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ భార్య తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ చేసిన వాదనను ఖండించారు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా. నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయడానికి జిల్లా మేజిస్ట్రేట్ ఇతరుల నుంచి తీసుకున్న సమాచారంపై ఆధారపడలేదని సుప్రీం కోర్టుకు చెప్పారు. "జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వు జారీ చేసిన తర్వాత, ఒక డీఐజీ ర్యాంక్ అధికారి అతడి వద్దకు వెళ్లి ప్రతిదీ వివరించి, తన ప్రసంగాల వీడియోలను చూపించారు. అతడిని నిర్బంధించడానికి గల కారణాలన్నింటిని చెప్పారు. అందుకే అతడిని నిర్బంధించడానికి నాలుగు గంటలు పట్టింది" అని వివరించారు. కేంద్రం ప్రస్తావనలు సంచలనంగా మారాయి.

# హార్డ్ వర్క్ చేయకపోతే..
# ఎవ్వరు కాపాడలేరు..!

**లైఫ్‌లో ఒకానొక టైంలో కష్టపడకపోతే..మనల్ని ఎవ్వరు రక్షించలేరు అన్నది జగమెరిగిన సత్యం. మన పెద్దలు కూడా వయసులో ఉన్నప్పుడు ఏదైనా సంపాదించగలం, ఆ తర్వాత మనతరం కాదు అని అంటుంటారు. అలాగే కష్టబడి డిగ్రీలు చదివి..ఉద్యోగం సంపాదించక హమ్మయ్యా అనేస్తాం. కానీ అక్కడి నుంచే మన అభివృద్ధి, ఎదుగుదల మొదలవ్వుతుంది. అలాకాకుండా..చతికిలపడితే అంతే పరిస్థితి అంటూ నెట్టింట షేర్ చేసిన పోస్ట్ అందర్నీ అమితంగా ఆకర్షించడమే గాక ఆలోచింపచేసేలా ఉందంటూ ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.**



26 ఏళ్ల మైక్రోసాఫ్ట్ ఉద్యోగి నందిని శర్మ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా గొప్ప కెరీర్ పాఠాన్ని షేర్ చేశారు. టీనేజ్ చివరలో.. 20ల ప్రారంభంలో ఉన్నవారికి ఉపయోగపడే అద్భుతమైన కెరీర్ సలహాలను ఇచ్చారామె. కార్పొరేట్ లైఫ్ వాస్తవికంగా ఎలా ఉంటుందనేది ఒక్క మాటలో చెప్పేశారామె. కెరీర్ ప్రారంభ సవంత్సరాల్లో అందరి దృష్టి డబ్బు పైనే ఫోకస్ ఉంటుంది. ప్రయత్న లోపం లేకుండా విజయపరంపరతో జాబ్‌లో దూసుకోవడం అనేది ఎప్పటికీ శక్తిమంతమైనదని నొక్కి చెప్పారు. అది ఇరవైలలోనే సాధ్యమని అప్పుడే మంచిప్రయోజనం పొందగలమని అన్నారు. ఎందుకంటే అప్పటికీ ఎలాంటి కుటుంబ ఒత్తిళ్లు, బాధ్యతలు ఉండవు, పైగా వారివద్ద చాలా సమయం ఉంటుంది. అందువల్ల దాన్ని సద్వినియోగం చేసుకునేలా వ్యక్తిగత డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెడితే రానురాను కష్టం అనే మాటే ఉండదని అన్నారు. ఇలాంటి ధోరణితో ఉంటే గనుక రిస్క్ తీసుకునేందుకు భయపడరు, నైపుణ్యాలను అందిపుచ్చుకునే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు.

మనం ఫ్రీగా ఉన్న టైంలోనే కష్టపడేందుకు ఆసక్తి చూపాలి..అప్పుడే మన కెరీర్ ఉన్నతంగా ఉంటుంది..అలాగే ఈ కార్పొరేట్ లైఫ్‌లో మన మనుగడ సాధ్యమని నొక్కి చెప్పారామె. లేదంటే మనల్ని కాపాడే వారెవ్వరూ లేరు అని గుర్తించుకోండి అని అన్నారామె. తాను మైక్రోసాఫ్ట్‌లో పనిచేస్తున్నప్పటికీ..తన కెరీర్, ఫిట్‌నెస్ లక్ష్యాలు, సాధించాల్సిన ఆశయాలను ఎప్పటికీ గుర్తించుకుంటానని అన్నారు. అంతేగాదు తన విజయవంతమైన కెరీర్ జర్నీని డాక్యుమెంట్ చేయాలని భావిస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. ఐటీలో పని చేస్తూ కెరీర్‌పై ఎన్నో కలలతో ఉన్నవాళ్లకు ఈ సందేశం ఎంతగానో ఉపయోగపడుతుందంటూ తన పోస్ట్‌ని ముగించారు శర్మ. కష్టే ఫలి అంటే ఇదేగదూ.! అంతేగాదు నెటిజన్లు సైతం ఇది ముమ్మాటికీ నిజం. ఎవ్వరికీ మన సమస్యను పట్టించుకునేంత సమయం లేదు. అందరూ వారివారి సమస్యలతో వాళ్లు బిజీగా ఉన్నారని కొందరూ. మరికొందరూ డెవలప్‌మెంట్ అనేది ఉద్యోగ ఆఫర్‌తో ముగిసిపోదని అక్కడ నుంచే ప్రారంభమని కామెంట్లు చేస్తూ పోస్టులు పెట్టారు.



## దండకారణ్యం నుంచి వచ్చిన
# ఆత్మవిమర్శ

2018 దండకారణ్య ఘటనల నేపథ్యంలో తమ రాజకీయ-సైనిక వ్యూహాలపై మావోయిస్టు పార్టీ తాజాగా విడుదల చేసిన ఇంటర్వ్యూ ఒక కీలకమైన ఆత్మవిమర్శగా చూడాలి. విప్లవ ఉద్యమ చరిత్రలో ఆత్మవిమర్శ అనేది కొత్త కాదు. కానీ, పరిస్థితుల విశ్లేషణతో పాటు నిర్ణయాల్లో జరిగిన పొరపాట్లను బహిరంగంగా అంగీకరించడం రాజకీయ పరిపక్వతకు సూచిక. దండకారణ్యంలో 2018లో ఎదురైన నష్టాల అనంతరం “దళాలను అప్పుడే రీట్రీట్ చేయాల్సి ఉండేది” అన్న అభిప్రాయం, ఉద్యమం ఎదుర్కొన్న వాస్తవ పరిస్థితుల్ని అర్థం చేసుకునే ప్రయత్నంగా కనిపిస్తుంది.

ఆ కాలంలో భద్రతా బలగాల విస్తృత ఆపరేషన్లు, ఆధునిక నిఘా వ్యవస్థలు, నిరంతర కాంబింగ్ చర్యలు దండకారణ్యాన్ని కుదిపేశాయి. స్థానిక భౌగోళిక పరిజ్ఞానం, ప్రజా మద్దతు వంటి సంప్రదాయ బలాలున్నప్పటికీ, శత్రుపక్షం సాంకేతికంగా ముందుండటం ఉద్యమాన్ని ఇబ్బందుల్లోకి నెట్టింది. ఈ నేపథ్యంలో దళాల భద్రత, ప్రజల రక్షణ, దీర్ఘకాలిక వ్యూహం—ఈ మూడింటి మధ్య సమతుల్యత సాధించడంలో లోటు ఏర్పడిందని ఆ ఇంటర్వ్యూ పరోక్షంగా అంగీకరిస్తోంది.

### ఆత్మవిమర్శలో ప్రధానంగా కనిపించేది...


రాజకీయ లక్ష్యాలు ఎంత స్పష్టంగా ఉన్నా, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాత్మక సవరణలు చేయకపోతే నష్టాలు తప్పవు. 2018లో దళాలను వెనక్కి తీసుకుని పునర్వ్యవస్థీకరణ చేసుకుని ఉంటే ప్రాణనష్టం, నిర్మాణ నష్టం తగ్గి ఉండేదన్న వాదనకు ఇది బలం ఇస్తోంది. యుద్ధం కన్నా రాజకీయ పని ప్రాధాన్యమనే భావనను మరలా గుర్తుచేస్తోంది. ఇక్కడ మరో కోణం కూడా ఉంది. దండకారణ్యం వంటి ప్రాంతాల్లో సాధారణ ప్రజల జీవితం నిత్యం ఆపరేషన్ల మధ్య నలిగిపోతోంది. ఎవరి వ్యూహం ఎలా ఉన్నా, తుదకు మూల్యం చెల్లించేది ఆదివాసీలు, గ్రామీణ పేదలే. ఆ ఇంటర్వ్యూలో ప్రజలపై పడిన భారాన్ని గుర్తించడం, భవిష్యత్‌లో ప్రజా సంబంధాలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సూచించడం గమనార్హం. ఇది కేవలం సైనిక నిర్ణయాల విమర్శ కాదు; ఉద్యమం-ప్రజల సంబంధాలపై పునరాలోచన కూడా.

అయితే ఈ ఆత్మవిమర్శ ఎంతవరకు విధాన మార్పులకు దారితీస్తుందన్నది ప్రశ్న. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని రాజకీయ చర్చలు, ప్రజా ఉద్యమాలు, ఐక్య పోరాటాలపై దృష్టి పెడితేనే ఈ విమర్శకు సార్థకత ఉంటుంది. లేకపోతే, ఇది ఒక దశలో పరిమితమైపోయే ప్రమాదం ఉంది.

రాష్ట్రం వైపు నుంచి కూడా ఈ ఇంటర్వ్యూను గమనించాల్సిన అవసరం ఉంది. కేవలం సైనిక పరిష్కారాలతో సమస్యలు తీరవని చరిత్ర పదే పదే రుజువు చేసింది. అభివృద్ధి, న్యాయం, భూమి-అడవుల హక్కులు, ఆదివాసీల స్వయం నిర్ణయం వంటి మూల సమస్యలను పరిష్కరించకుండా శాంతి సాధ్యంకాదు. ఈ నేపథ్యంలో ఉద్యమం చేసిన ఆత్మవిమర్శ, ప్రభుత్వానికి కూడా ఆత్మపరిశీలనకు అవకాశం కల్పించాలి.

మొత్తానికి, 2018 దండకారణ్య ఘటనలపై మావోయిస్టు పార్టీ చేసిన ఈ వ్యాఖ్యలు ఒక కీలక మలుపుగా చూడవచ్చు. రీట్రీట్ చేయాల్సిన అవసరాన్ని అంగీకరించడం ఓటమి అంగీకారం కాదు; మార్పుకు సంకేతం. ఆ మార్పు ప్రజల శ్రేయస్సు, రాజకీయ పరిష్కారాల దిశగా సాగితేనే ఈ ఆత్మవిమర్శకు చారిత్రక విలువ ఉంటుంది.

- అభయ్




# మహానటి బ్యూటీ ఇల్లు..
# కేరళ శైలికి కేరాఫ్‌గా..!

**మహానటి హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన అందం, నటన అశేష ఆదరాభిమానాలు పొందిన ముద్దుగుమ్మ. విలక్షణమైన నటనతో విమర్శకుల ప్రశంసలందుకున్న నటి. ఆమె తన చిరకాల స్నేహితుడు ఆంథోని థటిల్‌ని పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. చూడచక్కగా ఉండే ఈ జంట ఇల్లు కూడా వారిలానే ఆద్యంత అందంగా..అద్భుతాలకు నెలవుగా బహు సుందరంగా ఉంది. అది ఇల్లా లేక ఏదైనా టూర్‌కి వెళ్లామా అనేలా కళాకృతులకు నిలయంగా మరో ప్రపంచంలోకి తీసుకువెళ్తున్నట్లుగా ఉంటుంది. మరీ హీరోయిన్ కీర్తి ఇంటిని ఎంత అందంగా తీర్చిదిద్దుకుందో తిలకిద్దాం రండి..!.**

"హౌస్ ఆఫ్ ఫన్"గా పిలచే కీర్తి ఇల్లు ఆధునికత, సంప్రదాయాల మేళవింపుగా అత్యంత అందంగా తీర్చిదిద్దారు. ఆరుబయట బ్యాక్ వాటర్స్ ఉత్కంఠభరిత దృశ్యాలు ఉత్సాహాన్ని అందిస్తే..లోపటి సుందర దృశ్యాలు సౌందర్యాలి ఆలవలంగా ఉంది. అందమైన చిన్న వంటగది, బ్యాక్‌వాటర్స్‌తో చుట్టబడిన బాల్కనీ, వాక్ ఇన్ వార్డ్‌రోబ్‌తో విశాలమైన బెడ్‌రూమ్ మరో ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. ఇక అక్కడే గోకు వేలాడదీసిన చంద్రుడి కళలు..వారే డేటింగ్ ప్రారంభించిన రోజు, వివాహం చేసుకున్న రోజున చంద్రుని కళల దశల జాబితాను అందించే కళాకృతి కళ్లను పక్కకు తిప్పనివిధంగా కట్టిపడేస్తుంది. నటిగా తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన మహానటి మూవీకి సంబంధించిన ఛాయచిత్రాలతో కూడిన ఫ్రేమ్ కీర్తి నటనను గుర్తు చేస్తోంది. డైనింగ్‌టేబుల్ వద్ద వారి వివాహ ఫోటోలు, వెడ్డింగ్ కార్డ్ ఫ్రేమ్ స్పెషల్ ఎంట్రాక్షన్‌గా ఉంటుంది. ఇక బెడ్‌రూమ్ కేరళ శైలిలో బూడిద రంగు గోడలు నిండా వ్యక్తిగత ఫోటోలతో కనువిందు చేయగా, అక్కడ సమీపంలోని ఫలకంపై “ఎవరూ హుందాగా బయటకు రారు” అని రాసి ఉంది. దాన్ని చూపిస్తూ..ఈ దృశ్యం, అక్కడి వైబ్స్ చాలా మత్తుని స్థాయని హాయిగా నిద్రపట్టేస్తుందని అంటోంది కీర్తి. లివింగ్ రూమ్‌లో మెత్తటి బూడిద రంగు సోఫాలు, రిలాక్స్డ్ వైబ్స్ అందిస్తున్నాయి. అక్కడ కూడా వాల్స్‌పై ఫోటోలు అలంకరించి ఉన్నాయి. అలాగే ఒక ప్రైవేట్ హోమ్ థియేటర్, టెర్రస్‌పై యోగా, సాధారణ ఫోటోషూట్‌లు, సూర్యాస్తమయాలను ఆస్వాదించేలా అందంగా తీర్చిదిద్దారు. నిజానికి ఈ అందమైన ఇల్లు బిజీగా ఉండే ఆమె ప్రొఫెషనల్ జీవితానికి దూరంగా చక్కటి విశ్రాంతి అందించే ప్లేస్.

# జెన్‌జీలు ఇంత
# మంచోళ్ళు ఏంట్రా!?

జెన్‌జీ అనగానే చాలామందికి రకరకాల అపోహలు. సక్రమంగా పనిచేయరని, ఏ విషయానికీ శ్రద్ధ చూపరని, బాధ్యతగా ఉండరని... ఇలా ఇంటా బయటా వారిమీద ఓ అవవాదు ఉంది. కానీ తాజాగా వెలువడిన ఒక నివేదిక మాత్రం ఈ అపోహలను చెరిపేసింది. ‘జెన్‌జీలు ఇంత మంచోళ్ళు ఏంట్రా!’ అని అనిపించేలా ఆ నివేదికలో వివరాలు బయటపడ్డాయి. ఏంటా నివేదిక? ఆ నివేదికలో ఏముంది?




బార్, రెస్టారెంట్, హౌస్ పార్టీ - ఏ సందర్భమైనా మద్యం తప్పనిసరి అన్న భావన ఉండేది. కానీ తాజాగా నిర్వహించిన ఒక సర్వే ప్రకారం జెన్‌జీలు మద్యం వినియోగానికి దూరంగా ఉంటున్నారని తేలింది. బీర్, వైన్, స్పిరిట్స్ వంటి పానీయాలను వీరు పెద్దగా పట్టించుకోవడం లేదు. యువతలో మద్యం వినియోగం తగ్గుతుండగా, ఆరోగ్యంపై శ్రద్ధ, మితంగా జీవించడం, జీరోఆల్కహాల్ పానీయాలపై ఆసక్తి పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా మద్యం వినియోగ ధోరణులు మారుతున్నాయి.

అమెరికాలో గ్యాలప్ సర్వే ప్రకారం 1834 ఏళ్ల వయసు గల యువతలో మద్యం తాగే వారి శాతం గత రెండు దశాబ్దాల్లో తగ్గింది. 2000ల ప్రారంభంలో 72 శాతం మంది తాగుతుండగా, ఇటీవల అది 62 శాతానికి పడిపోయింది. మిల్లెనియల్స్‌తో పోలిస్తే జెన్‌జీ తరం సుమారు 20 శాతం తక్కువగా మద్యం సేవిస్తోంది. మరో సర్వే ప్రకారం 21.5 శాతం మంది జెన్‌జీలు అసలు మద్యం తాగరని, 39 శాతం మంది అప్పుడప్పుడు మాత్రమే తాగుతారని తేలింది.

### ఎందుకు తగ్గిస్తున్నారు?

మద్యం వల్ల నిద్రలేమి, ఆందోళన, హ్యాంగోవర్ వంటి సమస్యలు వస్తాయని యువత స్పష్టంగా గుర్తిస్తోంది. ఫిట్‌నెస్, మైండ్‌ఫుల్‌నెస్, మానసిక స్థైర్యం కోసం మద్యం దూరం చేస్తున్నారు.

### సామాజిక ప్రభావం:

సోషల్ మీడియా యుగంలో ప్రతి నిర్ణయం బహిరంగంగా కనిపిస్తోంది. అందుకే మద్యం తాగకపోవడం కూడా ఒక సామాజిక సందేశంగా మారింది. ‘సోబర్ క్యూరియస్’ ఉద్యమాలు, మద్యం లేని సమావేశాలు, వెల్‌నెస్ ఈవెంట్లు యువత సంస్కృతిలో భాగమయ్యాయి.

### ఆర్థిక కారణాలు:

పెరుగుతున్న జీవన ఖర్చులు, విద్యా రుణాలు, గృహ వ్యయాలు. ఇవన్నీ మద్యం వినియోగాన్ని తగ్గించేలా ప్రభావం చూపుతున్నాయి. ఖరీదైన నైట్‌లైఫ్ కన్నా ఇంట్లో సమావేశాలు, నాన్‌అల్కహాలిక్ పానీయాలు ఎక్కువగా ఎంచుకుంటున్నారు.

### తాగుతున్నవారు కూడా..

జెన్‌జీ తరం పూర్తిగా మద్యం మానేసిందని కాదు. తాగుతున్నవారు కూడా పూర్వతరాలతో పోలిస్తే భిన్నంగా తాగుతున్నారు. తక్కువ సార్లు, తక్కువ పరిమాణంలో, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే తాగుతున్నారు. అలాగే లోఅల్కహాల్, నాన్‌అల్కహాలిక్, ఫ్లేవర్డ్ పానీయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు.

### ఆహార, అతిథ్య రంగంపై ప్రభావం

ఈ మార్పు రెస్టారెంట్లు, బార్లు, బ్రాండ్లను కొత్త దారిలో నడిపిస్తోంది. మాక్‌టెయిల్స్, లోఅల్కహాల్ డ్రింక్స్, ప్రీమియం నాన్‌అల్కహాలిక్ పానీయాలు ఇప్పుడు మెనూలో ప్రధాన స్థానాన్ని పొందుతున్నాయి. పానీయాల కంపెనీలు కొత్తగా లోఅల్కహాల్, నాన్‌అల్కహాలిక్ విభాగాల్లో పెట్టుబడులు పెడుతున్నాయి.

జెన్‌జీ తరం మద్యం వినియోగాన్ని పూర్తిగా తిరస్కరించడం కాదు, దాని పాత్రను తిరిగి నిర్వచిస్తోంది. ఆరోగ్య ప్రాధాన్యత, ఆర్థిక వాస్తవాలు, సామాజిక మార్పులు - ఇవన్నీ కలిపి ఈ తరాన్ని కొత్త దారిలో నడిపిస్తున్నాయి. సంప్రదాయాలను ప్రశ్నించే, అలవాట్లకన్నా ఉద్దేశ్యాన్ని విలువ చేసే తరం ఇది.

# ప్రజావాణి వినతులు నిర్ణీత గడుపులోగా పరిష్కరించాలి

**పరిక్షా కేంద్రాలు, ప్రభుత్వ జూ.కళాశాలల పై దృష్టి సారించండి.. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ మహా;** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన వినతులను నిర్ణీత గడువులో పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్ తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్రజలు వినతి పత్రాలు సమర్పించి తమ సమస్యలను వివరించారు .ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌజింగ్, విద్యుత్, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 91 వినతులు అందినట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు సీరియస్‌గా పరిగణించి పక్షం రోజుల్లోగా తీసుకున్న చర్యలపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించాలని జిల్లా రెవెన్యూ



అధికారి వై.వి. గణేష్‌ను ఆదేశించారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాలను డీ ఆర్‌ఓకు అందజేయాలని అధికారులను సూచించారు.

**వార్షిక పరీక్షలు, హాస్టల్స్ ను పరిశీలించాలి**

పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు అధ్యాపకుల పనితీరు తదితర అంశాల పై నివేదిక సమర్పించాలని తెలిపారు. అలాగే హాస్టల్స్‌లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలను పరిశీలించి, అందులో వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. హాస్టల్స్‌లో శుద్ధమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం, తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించి, 8వ తరగతి నుండి 12వ తరగతి వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సంబంధిత శాఖల పీఐఓలతో డీఆర్‌ఓ ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీఆర్డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఏర్పాట్లు చేయండి

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

**వరంగల్ హన్మకొండ మహా;** మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల కమీషన్ జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుండి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియ, ఎక్స్ ఆఫీషియో సభ్యుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం ఇవ్వకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక సందర్భంగా శాంతి భద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని



ఆదేశించారు.ఎన్నికల ప్రవర్తన నియామావళి పూర్తిగా అమలులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్లకు, ఎక్స్ ఆఫీషియో సభ్యులకు ముందుగానే పూర్తి సమాచారం అందించాలని, పోలింగ్ నిర్వహణ నుండి లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను సక్రమంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు వరంగల్ హన్మకొండ జిల్లాల కలెక్టరేట్ల వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుండి కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్ అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓ లు, తదితర అధికారులు పాల్గొన్నారు.



# బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం ఆపివేయండి

**బల్దియా కమిషనర్ కు వినతి పత్రం అందజేత**

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 27వ డివిజన్లోని ఒకటో బ్లాక్ కు చెందిన బడుగు బలహీన వర్గాల దళితులు సోమవారం నిర్వహించిన బల్దియా ప్రజావాణి లో కమీషనర్ చాహత్ బాజ్ పాయి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాసాలకు ఎదురుగా 30 ఫీట్లలో ఉన్న పాత గ్రెయిన్ మార్కెట్ గోడౌన్లో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపడుతున్నారని గతంలో ఈ స్థలాన్ని మోడల్ మార్కెట్ ను చేస్తామని శంకుస్థాపన చేసారు. కొత్తగా నిర్మించిన కూరగాయల మార్కెట్ షిఫ్ట్ చేయడం జరిగిందని ఈ చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో దళితుల నివాసాలు కూరగాయల మార్కెట్ , పండ్ల మార్కెట్ , బస్టాండు తో పాటు ఆయుర్వేదిక్ హాస్పిటల్ ,బయోగ్యాస్ పెట్టే ప్రదేశానికి అతి సమీపంలో నిర్మిస్తున్నారు. ఇక్కడ రోజు కొన్ని వేల మంది వ్యాపారాలు చేయడానికి కొనుగోలు చేయడానికి వస్తుంటారని, ముఖ్యంగా దళితులు ఇక్కడే నివసిస్తున్నారని వీటి మధ్యలో ఈ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా పీల్చే గాలి కాలుష్యమై చిన్న పిల్లలు, వృద్ధులు, ప్రజలు అనారోగ్యాల పాలయి ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశాలున్నాయి, అందుచేత జనావాసాల మధ్య ఈ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణాన్ని ఆపివేసి ప్రజలు లేని దూర ప్రాంతాల్లో నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొనడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఖల్నాయక్, పోల్పాక ప్రేమ్ కుమార్, పోలేపాక విశాల్, పోలెపాక యాకోబు, మధు పాల్గొన్నారు.



# డ్రైన్ లలో చెత్త వేయకుండా చూడాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని డ్రైన్ లలో చెత్త వేయకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులు సిబ్బంది పై ఉన్నదని నగర మేయర్ గుండు సుధారాణి సూచించారు.సోమవారం బీట్ బజార్, బట్టల బజార్ తో పాటు మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29 వ డివిజన్ లోని రామన్న పేటలో మేయర్ క్షేత్రస్థాయిలో సందర్శించి రోడ్లు, డ్రైన్ ల స్థితి గతులను పరిశీలించారు.ఈ సందర్భం గా మేయర్ రోడ్డు పనులను, డ్రైన్ ల నిర్వహణ తీరు తో పాటు కమర్షియల్ చెత్త సేకరణ తీరు ను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు రెండు సార్లు ఖచ్చితం గా కమర్షియల్ చెత్త ను సేకరించేలా చూడాలని, దుకాణదారులు రోడ్డు పై చెత్త ను వేస్తే పెనాల్టీ లు విధించాలని,డ్రైన్ లలో చెత్త వేయకుండా చూడాలని, డివిజన్ లో టెండర్ లు పూర్తి అయిన వివిధ పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భం గా మేయర్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎం హెచ్ ఓ డా.రాజేష్ , ఈ ఈ రవి కుమార్, డి ఈ మొజామిల్, సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్, గోల్కొండ శ్రీను, ఏ ఈ లు హరికుమార్, సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

# వెండి ఆభరణాల అపహరణ కేసును ఛేదించిన పోలీసులు

- **నిందితుడి అరెస్ట్ ఐదు కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం**
- **పోలీసులను అభినందించిన వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా పరిధిలోని ఇంత జార్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వెండి ఆభరణాల అపహరణ కేసును ఇంత జార్గంజ్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు.

**వివరాల్లోకి వెళితే..**

హైదరాబాదుకు చెందిన పంకజ్ యాదవ్ తన వర్కర్స్ అయిన విమల్ యాదవ్, ముఖేష్ సోనీ లకు సుమారు ఐదు కిలోల వెండి ఆభరణాలు ఇచ్చి, వాటిని వరంగల్ లో విక్రయించి రావాలని సూచించారు. విమల్ యాదవ్ తో పాటు ముఖేష్ సోనీ లు ఆ వెండి ఆభరణాలతో తేదీ 29.01.2026 రోజు హనుమకొండ కు చేరుకొని, అక్కడి నుంచి ఒక ఆటోలో వరంగల్ వైపు ప్రయాణం చేస్తూ, బ్యాగులో ఉన్న వెండి ఆభరణాల విషయమై పరస్పరం మాట్లాడుకున్నారు.ఈ విషయాన్ని గమనించిన ఆటో డ్రైవర్, తేదీ 29/01/2026 రోజున రాత్రి 1.00 గంటల సమయంలో, వరంగల్‌లో విమల్ యాదవ్, ముఖేష్ సోనీ లు ఆటో దిగిన వెంటనే, వెండి ఆభరణాలు ఉన్న బ్యాగును ఆటోలోనే ఉంచుకొని అక్కడి నుంచి



పారిపోయాడు.ఈ ఘటన పై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇంత జార్గంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం జరిగింది. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎంఏ షుకూర్ వెంటనే స్పందించి, ఎస్ ఐ తేజ, పిసీఎస్ కె సురేష్, పి దీపక్ ల తో కలిసి సంఘటన జరిగిన ప్రాంత పరిసరాల్లోని సీసీ టీవీ కెమెరాలను పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సంబంధిత ఆటోను గుర్తించి, అపహరించబడిన వెండి ఆభరణాలను పూర్తిగా స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఆ ఆటో డ్రైవర్ వరంగల్ కాశిబుగ్గ కు చెందిన మెరుగు వెంకట్, తండ్రి పేరు నరసయ్య ను అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని ఇంత జార్గంజ్ ఇన్స్పెక్టర్ ఎంఏ షుకూర్ తెలిపారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీస్ సిబ్బందిని వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభమ్ ప్రకాష్ తో పాటు ఉన్నతాధికారులు అభినందించారు.

# బీజేపీ గెలుపే లక్ష్యంగా మనమందరం పనిచేయాలి

**బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**వరంగల్ మహా :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లాలో సోమవారం సత్యం కన్వెన్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన మున్సిపల్ ఎన్నికల ప్రభారిల కీలక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే లు టి రాజేశ్వరరావు, వన్నాల శ్రీ రాములు, జిల్లా ఎన్నికల కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మున్సిపాలిటీ ఎన్నికల ప్రభారీలు రావు పద్మ, గుజ్జ సత్యనారాయణ, జిల్లా కోకన్వీనర్ కంభంపాటి పుల్లారావు పాల్గొన్నారు.ఈ సమావేశంలో నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలలో బిజెపి విజయాన్ని సాధించాలనే సంకల్పంతో ఎన్నికల వ్యూహాలు, బూత్ స్థాయి నిర్వహణ, కార్యకర్తల సమన్వయం, ప్రజలతో నేరుగా అనుసంధానం వంటి అంశాలపై చర్చించడం జరిగింది.అభివృద్ధి, పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలనతో పాటు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే బిజెపి లక్ష్యం మున్సిపాలిటీల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని,



స్థానిక సంస్థలలో కూడా బలమైన, ప్రజాపక్ష పాలన అందించేందుకు బిజెపి నిరంతరం ముందడుగు వేస్తోందని గంట రవికుమార్ అన్నారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి విజయమే లక్ష్యంగా, అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాలు, ప్రచార కార్యక్రమాల పై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యకర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరి శంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, నియోజకవర్గ ఎన్నికల కోకన్వీనర్లు మల్లాడి తిరుపతి రెడ్డి, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, సర్పంచ్ తాళ్లపెల్లి కుమారస్వామి మరియు జిల్లా పదాధికారులు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల వార్డుల ప్రభారీలు పాల్గొన్నారు.



# ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన చల్లా ధర్మారెడ్డి..

**పరకాల మహా:** మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం పరకాల పట్టణంలోని 9వ వార్డు నుంచి ప్రారంభించారు.ఈ సందర్భంగా ముందుగా పరకాలలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల్లో విజయానికి శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆశీస్సులు కోరుకున్నారు. అనంతరం ప్రచార రథానికి వాహన పూజ నిర్వహించి ఇంటింటి ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించారు.ప్రచారంలో భాగంగా చల్లా ధర్మారెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరకాల పట్టణానికి జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అలాగే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన కల్పించారు.పరకాల ప్రజలే తన బలం, తన రాజకీయ జీవితానికి మూలమని పేర్కొన్న చల్లా ధర్మారెడ్డి ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, వార్డు స్థాయి కార్యకర్తలు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితునికి రక్తదానం చేసిన జిల్లా రామ్ చరణ్ యువత

**రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి బెడద వీరన్న**

**వరంగల్ మహా;** మెగా పవర్ స్టార్ డైనమిక్ ఉపాసన రాంచరణ్ లకు ప్రిన్స్ జన్మించిన సందర్భంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ అత్యవసరంగా రక్త సహాయం కొరకు వారం రోజులుగా ప్రయత్నం చేస్తున్న కరీంనగర్ వాస్తవ్యులు శ్రీనివాస్ కు రామ్ చరణ్ యువత జిల్లా అధ్యక్షుడు బొక్క నిరంజన్ నెంబర్ ను సేకరించుకుని సహాయం కోరగా తాను మెగా కుటుంబం వారసుడు జన్మించిన సందర్భంగా ప్రతిమ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అతనికి నాలుగు యూనిట్ల బ్లడ్ అవసరం ఉండగా తెలంగాణ రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి బెడద వీరన్న వరంగల్ జిల్లా రామ్ చరణ్ యువత జిల్లా అధ్యక్షులు బొక్క నిరంజన్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదానం చేయడం జరిగింది. రక్త దానం చేసిన వారిలో వరంగల్ జిల్లా చిరంజీవి యువత వర్కింగ్



అధ్యక్షులు బుద్ధ తిరుమల్, వరుణ్ తేజ్, జిల్లా అధ్యక్షులు కట్కూరి వంశీ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ జన్ను నరేష్ రక్తదానం చేసిన సందర్భంగా వారి సతీమణి ఎంతో ఆనందపడ్డారు. చిరంజీవి అభిమాన సంఘాలకు మా కుటుంబం ఎల్లవేళల రుణపడి ఉంటామని వారం రోజులుగా మా కుటుంబ పరిస్థితులు రక్తం లభించక ఇబ్బందులు పడుతున్న మాకు సహకరించి శ్రీనివాస్ ప్రాణాన్ని నిలిపిన వరంగల్ జిల్లా రామ్ చరణ్ యువత వరంగల్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రోజువారీ టార్గెట్ రూ.50 లక్షలు

- **పన్ను బకాయిల వసూళ్ల పై దృష్టి సారించండి**
- **బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**


**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని పన్ను బకాయిల వసూళ్ల పై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమ అనంతరం వివిధ విభాగాల అధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశం లో పాల్గొని సమర్థవంతం గా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు, బిల్డ్ నౌ లో చైన్ మెన్ లతో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన బిల్డింగ్ ఇన్స్పెక్టర్ లకు శిక్షణ ఇవ్వాలని, ఇంజనీరింగ్ అధికారులు గ్రీవెన్స్ లో వచ్చిన నల్లా లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను వారం లోగా క్లియర్ చేయాలని, నల్లా పన్నుల పెండింగ్ బిల్లులు వసూలు చేసే క్రమంలో భాగం గా ఫోన్ ద్వారా సమాచారం అందజేసి చెల్లించేలా ప్రోత్సహించాలని, రెవిన్యూ సిబ్బంది ప్రతి రోజు కనీసం రూ.50 లక్షలు వసూళ్లు చేపట్టాలని, శని, ఆది వారాలలో కూడా క్షేత్ర స్థాయిలో పన్నుల ను సేకరించాలన్నారు. రాబోవు రెండు మాసాలు సెలవులు లేకుండా వసూళ్ల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. నగర పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన పన్ను బకాయిలను వసూలు చేసేలా డిప్యూటీ కమిషనర్ లు ప్రత్యేక దృష్టి




సారించాలని ఇందు కోసం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి పన్ను వసూళ్లు చేయాలని, నగరం లో ఉన్న సెల్ టవర్ ల బకాయిలు రూ. 6 కోట్ల 50 లక్షల వరకు పెండింగ్ లో ఉన్నాయని అట్టి వసూళ్లను సంబంధిత ఏజెన్సీ లనుండి వసూలు చేయాలని, రాబోవు 2 నెలల పన్ను వసూళ్లను చేపట్టడానికి వీలుగా ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి వసూళ్లు చేపట్టేలా చూడాలని తెలిపారు.

**ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరు పై అసంతృప్తి**


ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరు ఆశాజనకం గా లేదని కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వసూళ్ల పై దృష్టి సారించాలని, 25% పెనాల్టీ మాఫీ ప్రక్రియను వేగవంతం గా చేపట్టి వాటి బకాయిలు చెల్లించేలా చూడాలని అన్నారు. ఆర్ ఐ లు రూ.50 వేలకు పైబడి బకాయిలు ఉన్న వారి జాబితాను తయారు చేసుకొని వాటి పై ప్రత్యేక దృష్టి సారించి వసూలు చేపట్టాలని ఈ సందర్భం గా కమిషనర్ ఆర్ ఐ లకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఇంచార్జి ఎస్ ఈ శ్రీనివాస్ రావు సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి డి ఎఫ్ ఓ శంకర్ లింగం, సి హెచ్ ఓ రమేష్,ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య,టి ఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# దొంగను పట్టుకున్న గ్రామస్తులు

**పరకాల మహా:** హన్మకొండ జిల్లా పరకాల మండలం, నాగారం సబ్ స్టేషన్ పరిధిలోని గౌరు వెంకట్ రెడ్డి, రమణారెడ్డి ఇంటి ఆవరణలో సుమారు రాత్రి 10:15గంటల ప్రాంతాన ఇంటి వెనకాల గోడ దూకి లోపలకి ప్రవేశించిన దొంగ ఇంటి వెనకాల నుండి శబ్దం రావడంతో అప్రమత్తమైన వెంకట్ రెడ్డి పట్టుకోవడం జరిగింది. ఇట్టి సమాచారాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చింతి రెడ్డి మధుసూదన్ రెడ్డి మరియు గ్రామ సర్పంచ్ రమాదేవి శ్రీనివాస్, పాలక వర్గం తక్షణమే స్పందించి ఇంటి దగ్గరికి వచ్చి అతను బీహార్ చెందిన దొంగగా గుర్తించి పోలీసుల కు అప్పగించడం తో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు దయచేసి గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు

# బీఆర్ఎస్‌లో చేరిన జాల రవీందర్ రెడ్డి..



**పరకాల మహా:** పరకాల మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాల రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ లో చేరారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి , పరకాల /మున్సిపాలిటీ సమన్వయకర్త, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిపెల్లి వాసుదేవ రెడ్డి సమక్షంలో జాల రవీందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలతో విసుగెత్తిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు.జాల రవీందర్ రెడ్డి చేరికతో 14వ వార్డులో బిఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చింతి రెడ్డి మధుసూదన్ రెడ్డి బండి సారంగపాణి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న**

# బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఖాళీ ప్రసాదరావు

**పరకాల, మహా:** హన్మకొండ జిల్లాపరకాల మున్సిపాలిటీ 3వ వార్డ్ అభ్యర్థి వేముల సదా రాణి ఆంజనేయులు గెలుపే లక్ష్యంగా ప్రజల్లో ఉత్సాహం నింపుతూ ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించిన బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, పారదర్శక పాలన,ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగాబీజేపీ అభ్యర్థి వేముల సదా రాణి ఆంజనేయులు కు మద్దతు ఇవ్వాలనిప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డా సిరంగి సంతోష్ కుమార్ వార్డ్ కన్వీనర్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్ సంగెం మండల అధ్యక్షులు దామెరుపుల చంద్రమౌళి నడికూడ మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్ పరకాల పట్టణ సెక్రటరీ చెంతన్ రెడ్డి బాసాని సోమరాజు హేమలత ప్రధాన కార్యదర్శి తిప్పారపు సుధీర్ సీనియర్ నాయకులు సల్పాల సురేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా కంటక కేంద్ర బడ్జెట్ ను సవరించాలి

**ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్**

**వరంగల్ మహా;** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశ ప్రయోజనాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టే విధంగా ఉందని తక్షణమే బడ్జెట్ ను సవరించి దేశీయ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి గ్రామీణ మౌలిక సదుపాయాలకు ఉపాధికి నిధులను పెంచాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంసిపిఐ(యు) నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ వరంగల్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎంసిపిఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వికసిత్ భారత్ పేరుతో ప్రచార ఆర్భాటం చేస్తూ లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకుంటున్న మోడీ ప్రభుత్వం ఆచరణలో సంస్కరణల వేగవంతం పేరుతో ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగాలను సంపదను ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుట్ర పన్నిందని ఈ క్రమంలో పట్టణీకరణ పేరుతో వివిధ రకాల సేవలను రద్దుచేసి కమర్షియల్ గా మార్చి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి రంగాలైన రైతుల వ్యవసాయాన్ని దేశీయ పరిశ్రమలను దివాలా తీయించే విధంగా విధానాలను రూపొందించి కా



ర్పొరేట్ వ్యవసాయాన్ని విదేశీ పెట్టుబడుదారులను ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అందులో భాగంగానే బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అన్నారు. గ్రామీణ ఉపాధికి మౌలిక సదుపాయాల కు తగిన విధమైన కేటాయింపులు జరపకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రస్తుత బడ్జెట్లో దేశ ప్రయోజనాలకు అభివృద్ధికి అనుగుణంగా సమతుల్యత పాటించి కేటాయింపులు జరపాలని ప్రాధాన్యత రంగాలకు కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర ప్రతాప్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్ ముక్కెర రామస్వామి, ఏరియా కార్యదర్శులు ఐతం నాగేష్ మహమ్మద్ మెహబూబ్ పాషా పరిమళ గోవర్ధన్ రాజు నగర నాయకులు మాలి ప్రభాకర్ అప్పనపురి నర్సయ్య నలివెల రవి జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ ఇస్మాయిల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




# గుర్తు తెలియని మహిళ మృతి

**హన్మకొండ మహా;** హన్మకొండ బస్టాండు పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ తిరిగే 45 నుంచి 50 సంవత్సరాలు వయసు ఉండే మహిళ బస్టాండ్ పార్సెల్ కార్యాలయం సమీపంలో చనిపోయి ఉన్నదని హనుమకొండ పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా మృతి చెందిన మహిళను ఎవరైనా గుర్తుపడితే వెంటనే హనుమకొండ పోలీసులకు 8712685002 నెంబర్ కు సంప్రదించగలరని హన్మకొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు.

# సీసీ కెమెరాల నిఘాలో ప్రయోగ పరీక్షలు

**జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్**

**వరంగల్ మహా;** ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ నేడొక ప్రకటనలో తెలిపారు. సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు రెండు పూటలా నిర్వహించబడ్డాయి. ఉదయం 9 గం నుండి 12 గం వరకు, మధ్యాహ్నం 2 నుండి 5 గం.ల వరకు పరీక్షలు సీసీ కెమెరా నిఘాలో బోర్డు నిబంధనల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం జనరల్ మొత్తం 669 విద్యార్థులకు గాను 654 హాజరు కాగా 14 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ మొత్తం 509 విద్యార్థులకు గాను 438 హాజరు కాగా 71 గైర్హాజరయ్యారు.



మధ్యాహ్నం జనరల్ మొత్తం 427 విద్యార్థులకు గాను 420 హాజరు కాగా 07 గైర్హాజరయ్యారు. ఒకేషనల్ మొత్తం 246 విద్యార్థులకు గాను 237 హాజరు కాగా 09 గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షలను డీఈసీ సభ్యులు మాధవరావు, విజయ నిర్మల, ఫ్లయింగ్ స్క్వాడ్ బృదం ఖయ్యూమ్, కొమురా రెడ్డి తదితరులు పర్యవేక్షించి ఇంటర్ బోర్డుకు సంబంధిత నివేదికలను పంపించడం జరుగుతుందని అధికారి తెలిపారు.

## సీపి ఆదేశాలు ఖుర్షీద్ హోటల్ కు వర్తించవా?



**వరంగల్ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోలోని వరంగల్, హనుమకొండ ఉన్నహోటళ్లు, వ్యాపారాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు రాత్రి 10.30 తర్వాత తెరవకూడదనే ప్రభుత్వ నిబంధనలతో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలు జారీచేసిన విషయం అందరికి తెలిసిందే. కాగా గత కొన్ని రోజుల క్రితం షాప్ యజమానులు నిబంధనలు ఉల్లంగిస్తే మా పై చర్యలకు బాధ్యులమని పేపర్ల పై ఆయా పోలీస్ స్టేషన్ల లో సంతకాలు చేయించుకున్నారు. కాని కొన్ని రోజులుగా వరంగల్ మండి బజారు లోని ఖుర్షీద్ హోటల్ కు మాత్రం ఎటువంటి నిబంధనలు వర్తించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోజు అర్ధరాత్రి వరకు హోటల్ నడుపుతూ మరో పక్క పార్సల్ కావాలన్న వారికి... రోడ్ల పైనే ద్విచక్ర వాహనాల పై అమ్ముతున్నారు. ఎవరైనా రాత్రి వరకు మీరు హోటల్ నడపవద్దు కదా అని అడిగితే వారు వాగ్వివాదానికి దిగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అసలు వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనలు సాధారణ ప్రజలకేనా అని మండే బజార్లో ఎన్నోసార్లు అనేక గొడవల తో పాటు హత్యాయత్నాలు జరిగాయని ఈ గొడవలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ప్రజలు వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి అర్ధరాత్రి వరకు వ్యాపారాలు నిర్వహించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఖానాపూర్ లో జోరుగా కాంగ్రెస్ ప్రచారం

### పాల్గొన్న పార్టీ రాష్ట్ర నాయకులు అభిషేక్ రెడ్డి.. భార్గవిరాజును భారీ మెజార్టీతో గెలిపించాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఖానాపూర్ లో అభిషేక్ రెడ్డి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రధాన పార్టీలలో ప్రచారం జోరు అందుకుంది. ఇందులో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పదో వార్డ్ ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, దొంతరమోని భార్గవిరాజు తరపున కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్ రెడ్డి రంగారెడ్డి అభిషేక్ రెడ్డి ప్రచారంలో పాల్గొని కార్యకర్తలల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్లిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల గురించి వివరిస్తూ ఖానాపూర్ గ్రామ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, గ్రామంలోని పేదలకు 50 వరకు ఇందిరమ్మ ఇళ్ళను అందించడం జరిగిందని అభిషేక్ రెడ్డి తెలియజేశారు. మరింత అభివృద్ధి జరగాలంటే మీ యొక్క అమూల్యమైన ఓటును, తమ అభ్యర్థి భార్గవి రాజుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.



ఖానాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం...

కోవిడ్ 19 కరోనా కారణంగా ఖానాపూర్ గ్రామానికి వచ్చే బస్సు నిలిచిపోవడంతో, గ్రామంలోని ప్రజలు విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సమస్య పరిష్కరించాలని, అభిషేక్ రెడ్డిని ప్రజలు కోరగా, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ తో ఫోన్లో మాట్లాడిన ఆయన, ఖానాపూర్ గ్రామానికి యధావిధిగా బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరడంతో సానుకూలంగా స్పందించిన డిఎం, బస్సు నిలిచిపోవడానికి గల కారణాలను పరిశీలించి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. దీంతో త్వరలో గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులు తీరనున్నాయని ఆయన తెలిపారు. గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ పబ్లిక్ స్కూల్ సందర్శించిన జోష్నా రెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** మంచాల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను జోష్నా రెడ్డి సందర్శించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాలలోని టీపీఎస్ పనులను విద్యా విద్యా కమిషన్ మెంబర్ జోష్నా రెడ్డి పరిశీలించారు. పాఠశాల భవన నిర్మాణంలో నాణ్యత లోపించకుండా నిర్మాణం చేపట్టాలని, సైట్ ఇంజనీర్ ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఇంజనీరింగ్ విభాగంలో అప్రూవల్ అయిన మ్యాప్ డ్రాయింగ్ ప్రకారమే నిర్మాణం చేపట్టాలని, కాంట్రాక్టర్కు సూచించారు. అనంతరం ఎంఎస్ఎంసి సభ్యులు సమావేశంలో పాల్గొన ఆమె సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిఎస్ ప్రధానోపాధ్యాయులు ఆర్ నారాయణ రెడ్డి, జూనియర్ కాలేజ్, జెడ్పిహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు అశ్వాల బాల్ రాజ్ గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మున్సిపాలిటీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం ప్రారంభం

### చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే



**పరకాల మహా:** కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజలు పూర్తిగా గుర్తించారని, మున్సిపాలిటీ ఎన్నికలతో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభం కావడం ఖాయమని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు స్పష్టం చేశారు.పరకాల పట్టణం ఒకటవ వార్డులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలు, హామీల అమలులో ఘోర వైఫల్యం కారణంగా ఆ పార్టీపై ప్రజలకు నమ్మకం పూర్తిగా పోయిందని చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి కాలం గడుస్తున్నా ఒక్క హామీ కూడా అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.ఈ సమావేశంలో వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులుఒంటేరు ఆంకుసు, ఒంటేరు బిక్షపతి, ఒంటేరు అనిల్, ఒంటేరు హిందు, బండారి బాబు, పవన్, బొచ్చు టోనీ, మడికొండ సుజిత్, స్వామి, ఈర్ల నాగరాజు, ఇలందుల బొచ్చు ఆదమ్, బొచ్చు వినయ్, శ్యామల తదితరులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా ఆహ్వానించారు. చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను జాగృతం చేయడం ప్రతి బిఆర్ఎస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. బిఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. పరకాల పట్టణంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి మరిన్ని ఎదురుదెబ్బలు తప్పవని, బిఆర్ఎస్ విజయం ఖాయమని ఈ చేరికలు స్పష్టంగా చాటిచెబుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

### జనసేన పార్టీ తొలి బీ-ఫారం అందుకున్న
## బెల్లంపల్లి అభ్యర్థి అశ్విని క్రిష్ణ

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పుర ఎన్నికలకు నామినేషన్ల పర్వం ముగియడంతో ప్రధాన పార్టీల నుండి బిఫారం లను అందుకున్న అభ్యర్థులలో పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ నుంచి తొలి బీఫారం అభ్యర్థిగా 18వ వార్డు నుంచి అశ్విని కృష్ణ అందుకున్నారు.జనసేన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ మంతెన సంపత్, మంచిర్యాల జిల్లా నాయకులు తన్నీరు మధుకర్ బెల్లంపల్లిలో శ్రీమతి అశ్విని కృష్ణ కు అధికారికంగా బీఫారం అందజేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, కాంట్రాక్టర్ బస్తీ 18వ వార్డు ప్రజలు భారీ మెజార్టీతో అశ్విని కృష్ణ ను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.జనసేన పార్టీ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతుందని తెలిపారు.ఇందులో పి ఓ సి సభ్యులు సలిగంటి శ్రీనివాస్,మేకల పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

## మైనారిటీ యువతకు ఉపాధి శిక్షణ

**ఆదిలాబాద్ మహా :** నిరుద్యోగ మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణం లోని ఉర్దూ భవన్లో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టైలరింగ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వంటి కోర్సుల్లో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ప్రస్తుత కాలంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని 'జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్' కోర్సును ప్రవేశపెట్టామని, దీని ద్వారా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా




మహిళల కోసం స్వయం ఉపాధిని ఇచ్చే 'టైలరింగ్' శిక్షణ కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, ప్రాక్టికల్ అంశాలపై దృష్టి సారించాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు ఉపాధి మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలిమ్, ఫాకల్టీ లు, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### కార్మికులకు కరపత్రాలను అందజేసిన రాష్ట్ర కార్యదర్శి జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్, మహా ;** అత్తాపూర్ సర్కిల్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో ఏఐటియుసి నాయకులు ఫిబ్రవరి 12 తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం కార్మికులకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మున్సిపల్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, మున్సిపల్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్దిలేటి, ఏఐటియుసి అధ్యక్షులు సాయిలు, ప్రధాన కార్యదర్శి టిఆనంద్, ఉపాధ్యక్షులు ఏరాజు, శ్రీను,కార్తీక్, రాజ్ కుమార్, పద్మ, సంతోష, పుష్పమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేద్దాం.. కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం..

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించండి:ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు, మహా :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 15 మంది అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం బలపరిచిన 15 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు బీఫాం లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మున్సిపాలిటీ పార్టీ అభ్యర్థుల విజయానికి పాటు పడాలన్నారు...ఈ కార్యక్రమంలో పిబిసి మెంబర్ బాలాజిసింగ్, పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా,మండల అధ్యక్షులు బిచ్య నాయక్, దోకూరు ప్రభాకర్ రెడ్డి




,నాయకులు వస్పుల శ్రీశైలం,గుజ్జుల మహేష్,శ్రీను, అలీమ్, నాసర్,తులసీరామ్, కుమార్ గౌడ్,మహేష్, మైసయ్య,ఇమ్రాన్, బాబా, సురేష్,కౌన్సిలర్ అభ్యర్థులు గుర్రం కేశవులు, మానయ్య, కృష్ణ నాయక్, కాలే మల్లయ్య,మహేష్, అప్పం శ్రీనివాస్, మల్లేష్, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో పీవో, ఏపీవోల పాత్ర కీలకం -కలెక్టర్

**ఆదిలాబాద్ మహా:** ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, రాజర్షి షా అన్నారు. పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలు 2026ను పురస్కరించుకుని సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఆయన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ రోజున కేంద్రాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళి, బ్యాలెట్ బాక్సుల వినియోగం, పోలింగ్ సమయాల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికా




రులు పూర్తి అవగాహన ఉండాలన్నారు. మున్సిపల్ ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఫామ్12 నింపి అందజేయాలని, సంబంధిత రిటర్నింగ్ అధికారులకు పంపించి, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలతో పోలిస్తే మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పార్టీల ప్రాతిపదికన జరుగుతాయని, కాబట్టి అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వందశాతం వెబ్ కాస్టింగ్ ఉంటుందని, దీని ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను తప్పనిసరిగా పోలింగ్ కేంద్రం వెలుపల ప్రదర్శించాలని, పోలింగ్ ఏజెంట్ల సంతకాలను సేకరించాలని సూచించారు. అలాగే, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఎవరినీ విధుల నుండి రిలీవ్ చేయవద్దని స్పష్టం చేశారు.



## అభివృద్ధిని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు..

**రాజేంద్రనగర్, మహా :** మండల పార్టీ సీనియర్ నాయకులు నిరటి రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో శంషాబాద్ మండలంచౌదర్‌గూడ ఉప సర్పంచ్ సంతపురి ప్రేమ్‌రాజ్, గ్రామ వార్డు సభ్యులు . మామిళ్ళ సబిత మల్లేష్‌యాదవ్, మల్చలం మంజుల జంగారావు, . మాజీ వార్డు సభ్యులు మునగల సంజీవ, వివిధ పార్టీలకు చెందిన మామిళ్ళ మురళి. పల్లె విజయ్ కుమార్ మునగాల ముఖేష్. సంతపురి గణేష్. భరత్. శరత్. సాయి. యాదయ్య. సత్తయ్య తదితరులు అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానన్నారు. భవిష్యత్తు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.కార్యక్రమంలో నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, చౌదర్ గూడ సర్పంచ్ లక్ష్మీ లింగం, పార్టీ సీనియర్ నాయకులు శివాజీ, బంగారం కుమార్, శ్రీనివాస్, తొంట అశోక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవేందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


## మున్సిపల్ బరిలో బీజేపీ జోరు

### కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థన

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేసింది.పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు.కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ మున్సిపల్ అభివృద్ధి కేవలం బీజేపీ తోనే సాధ్యమని ధీమా వ్యక్తం చేశారు.



## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన... బిజెపి నాయకులు మహేందర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు, పి మహేందర్ సుమారు వందమంది కార్యకర్తలతో, సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి మహేందర్ ను సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి భూపతిగళ్లా మహిపాల్, మున్సిపాలిటీ పదో వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## కారు గుర్తు గెలుపే లక్ష్యంగా 'గడప గడపకు' బిఆర్ఎస్!

### అభివృద్ధికి పట్టం కట్టండి.. భారీ మెజారిటీతో గెలిపించండి

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో కారు గుర్తు గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. లో బిఆర్ఎస్ అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహించారు.అభ్యర్థుల విజయానికి మద్దతు కోరుతూ బిఆర్ఎస్ నేతలు ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే తమ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.



## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

### అయిళ్ల శ్రీనివాస్ గౌడ్

**ఆమనగల్లు, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపిస్తాయని ఆమనగల్లు మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి,టిపిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.అమనగల్లు మున్సిపాలిటీలో వివిధ వార్డులలో అభ్యర్థులతో కలిసి ప్రచారం చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమనగల్లు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని చైర్మన్ పీఠాన్ని హస్తగతం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసే నాయకులు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులుగా టికెట్లు కేటాయించి బరిలో ఉన్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజాపాలనకు ప్రజల నుండి మంచి ఆదరణ ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు అధికార పార్టీ వైపు ఉన్నారని, ఆమనగల్లు మున్సిపాలిటీ లోని 15 స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధిస్తుందన్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమి లేదని కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాలలో లక్ష ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇల్లు,



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేసి అధికార పార్టీకి పట్టం కట్టాలని కోరారు..... ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, నాయకులు తదితరులు ఉన్నారు.

## బస్తీ పర్యటనలో సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, మహా :** కాటేదాన్, ఉద్దంగడ్డ,పల్లె చెరువు,అత్తాపూర్ సర్కిల్ బస్తీలలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. బస్తీలలో నెలకొన్న ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ లైన్లను పునరుద్ధరించాలి, నిరంతర తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రకాష్ గౌడ్ కి స్థానికులు తెలిపారు. కొత్త సిసి రోడ్ల నిర్మాణాలు, నిరంతరం వెలిగేలా వీధి దీపాల ఏర్పాట్లలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బస్తీలోని స్మశాన వాటికలో అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి సారించారు.బస్తీలో సమస్యలను గుర్తించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా, తక్షణమే ప్రణాళికలు సిద్ధం చేసి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పనుల నాణ్యతలో రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఎన్ ధనుంజయ్, ప్రేమ్ గౌడ్, సంతోష్ గౌడ్, యాదయ్య, అర్జున్, హరిచరణ్, కిషోర్, ప్రభాకర్, శేఖర్, రాంబాబు, బాబన్నా, అశోక్, జగదీష్, సహదేవ్, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి , శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, అనిల్, జగదీష్, రాము, శేఖర్,నాని మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## విష్ణు సహస్రనామ పారాయణం..

### రామయ్య హనుమద్వాహనాము పై దర్శనం...



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ లోని శ్రీ రామ నగరంలో శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి పర్యవేక్షణలోసమతాకుంభ్-2026 బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సమతాకుంభ్-2026 శ్రీరామానుజాచార్య 108 దివ్యదేశాల 4వ బ్రహ్మోత్సవాల మూడోవ రోజు ఉదయం యాగశాలలో ప్రత్యేక ఆరాధనలు, తీర్థగోష్టి నిర్వహించారు. సమతామూర్తి ప్రాంగణంలో రామానుజ నూత్తందాది పారాయణం చేశారు. రెండొవ రోజున గరుడ వాహనంపై ఊరేగిన 18 దివ్యదేశ మూర్తులకి తిరుమంజన సేవలు నిర్వహించి, అనంతరం అభిషేకం చేశారు.సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం అనంతరం 37వ దివ్యదేశం నుండి 54వరకు దివ్యదేశాధీశులకు 18 గరుడ సేవలు జరిగాయి. సాకేత రామచంద్ర ప్రభువుకు హనుమద్వాహనాము పై భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రసాద గోష్ఠితో ఈ రోజు కార్యక్రమం సంపూర్ణం అయింది.

# బెంగాల్‌కు కొత్తగా సరుకు రవాణా కారిడార్



పశ్చిమబెంగాల్, గుజరాత్ మధ్య వేగవంతమైన సరుకు రవాణా లక్ష్యంగా సరికొత్త కారిడార్‌ను ఆర్థిక మంత్రి నిర్మల ఆదివారం బడ్జెట్‌లో ప్రతిపాదించారు. 'సమీకృత ఈశాన్య భారత పారిశ్రామిక కారిడార్'లో భాగంగా పశ్చిమబెంగాల్‌లోని దంకునీ నుంచి గుజరాత్‌లోని సూరత్‌కు నూతన సరుకు రవాణా కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు నిర్మల ప్రకటించారు. బెంగాల్‌లోని దుర్గాపూర్ కేంద్రంగా ఈ కారిడార్‌ను విస్తరిస్తామని చెప్పారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పర్యాటక పథకమైన 'పూర్వోదయ విజన్'లో భాగంగా మరింత అభివృద్ధి చేస్తామని నిర్మల వెల్లడించారు. దంకునీ సూరత్ ఫ్రీట్ కారిడార్ అనేది పర్యావరణ అనుకూలమైనదేకాకుండా ఇరు రాష్ట్రాల మధ్య సరుకు రవాణా ఖర్చులనూ భారీగా తగ్గిస్తుందని నిర్మల పేర్కొన్నారు. నదీజల మార్గాల గుండా జరిగే సరకు రవాణాను సమీకృత కారిడార్లతో అనుసంధానించి బెంగాల్ పారిశ్రామికాభివృద్ధిని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తామని నిర్మల తెలిపారు. 294 నియోజకవర్గాలున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి మరో మూడునెలల్లో ఎన్నికలు జరగనున్న వేళ బెంగాల్‌కు మోదీ సర్కార్ వరాల జల్లు కురిపించడం గమనార్హం. పూర్వోదయ రాష్ట్రాలుగా పిలుచుకునే బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని ఆమె తెలిపారు. 4,000 ఎలక్ట్రిక్ బస్సుల అందజేతతోపాటు ఆయా రాష్ట్రాల్లో ఉపాధి పెంపు, ఆయా రాష్ట్రాల మధ్య జనం, వస్తూత్పత్తుల రవాణాపై దృష్టిపెట్టామని ఆమె వెల్లడించారు. విమర్శించిన తృణమూల్ కాంగ్రెస్‌రాష్ట్రానికి కొత్తగా సరుకు రవాణా కారిడార్ తెస్తామన్న నిర్మల నిర్ణయంపై బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పెదవి విరిచింది. 'పాత ప్రతిపాదనలకే కొత్త తాయిలాల పొట్లంలో కట్టి ఇస్తున్నారు. నిధుల మంజూరును గాలికొదిలేసి కేవలం కాగితాలకు పరిమితమయ్యే వాగ్దానాలు చేస్తున్నారు. ఇదంతా ఎన్నికల ఎత్తుగడ. గత ఐదేళ్లుగా ఇదే చూస్తున్నాం. బెంగాల్‌కు మోదీ సర్కార్ కేంద్రనిధులపై శ్వేతపత్రం జారీచేసే దమ్ముందా? 2021లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరాజయం తర్వాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్క కూలీకి అయినా ప్రత్యక్ష బదిలీ పథకం(ఈబీటీ) ద్వారా నగదు ఇచ్చినట్లు రుజువుచేస్తే రాజకీయ సన్యాసం చేస్తా' అని టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ వ్యాఖ్యానించారు.

**ఎన్నికల వ్యూహంగా అభివర్ణించిన విశ్లేషకులు**

అభివృద్ధి అని చెబుతున్నా వాస్తవానికి తాజా కేటాయింపులు కేవలం ఎన్నికల ఎత్తు గడగా భావించవచ్చని ఎన్నికల వ్యూహకర్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న టీఎంసీని గద్దెదించడమే లక్ష్యంగా బీజేపీ భారీ కేటాయింపులు చేస్తోందని వారు వ్యాఖ్యానించారు. "ఎన్నికలున్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో భారీ వడ్డనలు ఉండటం ఇటీవలికాలంలో ఒక సంప్రదాయంగా మారింది. ఈ కేటాయింపులు వాస్తవాలో కాదో గుర్తెరిగి తదుపరి ఎన్నికల్లో ఓటేసే స్పృహ ఓటర్లకు ఉండాల్సిందే" అని చెబుతున్నారు.

# ఒరాకిల్ నిధుల వేట.. రూ.14 లక్షల కోట్లు కావాలట!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో అగ్రగామిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న టెక్ దిగ్గజం ఒరాకిల్ సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఏఐ డేటా సెంటర్ల విస్తరణకు అవసరమైన భారీ నిధులను సమీకరించుకోవడానికి కంపెనీ దాదాపు 30,000 మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

**నిధుల కొరత**

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ టీబీ కోవెన్ పరిశోధన నివేదిక ప్రకారం.. ఒరాకిల్ తన ఏఐ మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు 156 బిలియన్ డాలర్ల(సుమారు రూ.14 లక్షల కోట్లు) భారీ పెట్టుబడిని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ స్థాయిలో అప్పులు ఇవ్వడానికి అమెరికాలోని ప్రముఖ బ్యాంకులు వెనకడుగు వేస్తుండటం కంపెనీకి పెద్ద సవాలుగా మారింది. ఈ వ్యవహారంపై ఈక్విటీ, రుణ పెట్టుబడిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తుండటంతో నిధుల కోసం కంపెనీ తన సొంత వనరులపై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

**తొలగింపుల ద్వారా ఎంతంటే..**

ఒరాకిల్ తన కార్యకలాపాల పునరుద్ధరణలో భాగంగా 20,000 నుంచి 30,000 మంది ఉద్యోగులను తగ్గించాలని భావిస్తోంది. ఈ భారీ లేఆఫ్స్ ద్వారా కంపెనీకి సుమారు 8 బిలియన్ల డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు నగదు అందుబాటులోకి వస్తుందని టీబీ కోవెన్ అంచనా వేసింది. ఒకవేళ ఇదే జరిగితే ఒరాకిల్ చరిత్రలోనే ఇది అతిపెద్ద లేఆఫ్ అవుతుంది. గతంలో 2025 చివరలో కంపెనీ తన పునర్నిర్మాణ ప్రణాళికలో భాగంగా 10,000 మందిని తొలగించింది. ఇటీవల అమెజాన్ కూడా తన ఏఐ వ్యూహంలో భాగంగా 16,000 మందిని తొలగించిన సంగతి తెలిసిందే.

**వ్యూహాత్మక మార్పులు**

నిధుల సమీకరణ కోసం ఒరాకిల్ మరికొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. 2022లో 28.3 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ యూనిట్ 'సెర్నర్'ను విక్రయించే ఆలోచనలో కంపెనీ ఉంది. 'బ్రింగ్ యువర్ ఓన్ చిప్' అనే కొత్త విధానాన్ని కంపెనీ ప్రవేశపెట్టాలని భావిస్తోంది. దీని ప్రకారం కస్టమర్లే తమ సొంత హార్డ్‌వేర్‌ను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఒరాకిల్‌పై మూలధన భారం తగ్గుతుంది. మౌలిక సదుపాయాల నిర్మాణంలో నేరుగా పెట్టుబడి పెట్టాలని క్లయింట్‌లను ఒరాకిల్ కోరుతోంది.




**భారీ లక్ష్యాలు**

క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సామర్థ్యాన్ని పెంచడానికి 2026 నాటికి 45 బిలియన్ డాలర్ల నుంచి 50 బిలియన్ డాలర్ల వరకు నిధులు సేకరించాలని ఒరాకిల్ లక్ష్యంగా పెట్టుకుంది. సామ్ ఆల్ట్‌మాన్ నేతృత్వంలోని ఓపెన్‌ఏఐ కోసం డేటా సెంటర్లను నిర్మించే బాధ్యతను కూడా ఒరాకిల్ గతంలో చేపట్టింది. అయితే ప్రస్తుత ఫైనాన్సింగ్ ఇబ్బందులు ఈ ప్రాజెక్టులపై ప్రభావం చూపే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

# తమిళనాడు సంస్కృతి పరిరక్షణకు..

డీఎంకే ఏలుబడిలో ఉన్న తమిళనాడుపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో కొత్తగా అరుదైన ఖనిజాల రవాణా కారిడార్‌ను నెలకొల్పనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతోపాటు చెన్నై మీదుగా పయనించే హైస్పీడ్ రైలు లింక్‌లను అభివృద్ధిచేయనున్నారు. పశ్చిమ కనుమల మార్గంలో పొధుగైమలై కొండ ప్రాంతంలో హైకింగ్, ట్రెక్కింగ్, మౌంటేన్ బైకింగ్ వంటి సదుపాయాలు కల్పించనున్నారు. పులికాట్ సరస్సుకు విచ్చేసే విదేశీ పక్షుల కోలాహలం, ప్రకృతి అందాలను పర్యాటకులు వీక్షించేందుకు బర్డ్ వాచింగ్ పాయింట్లను నిర్మించనున్నారు. త్వరలో తమిళ నాడు అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం పలు అభివృద్ధి పథకాల నిధులను భారీగా కేటాయించడం విశేషం. ఇనుప రాతి యుగం నాటి ప్రఖ్యాత ఆదిచనల్లూర్ ప్రాంతంలో పురాతత్వ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అక్కడ లభించిన పురాతన రాళ్లు, ఆనాటి నాగరికత వైభవాన్ని చాటే వస్తువులతో ఆర్కియాలాజికల్ సైట్‌ను అభివృద్ధిచేయనున్నారు. నాటి సంస్కృతికి కళ్లకు కట్టేలా అభివృద్ధి చేస్తామని ఆమె వెల్లడించారు. నడకదారిలో మొత్తం పురాతత్వ ప్రాంతాన్ని కలియతిరిగేలా వాక్‌వేలను నిర్మించనున్నారు. అక్కడి ప్రాచీన వస్తు వుల విశిష్టతను కథల రూపంలో చెప్పే లా, నాటి సాంకేతికతలను విడమర్చి విశదీకరించేలా గైడ్‌లను అందుబాటు లోకి తేనున్నారు. పాడైన ప్రాచీన వస్తు వులకు మరమ్మతులు, సంరక్షణ కోసం కన్జర్వేటివ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయ నున్నారు. పురాతత్వ ప్రాంతానికి విచ్చేసే పర్యా టకులు, విదేశీ సందర్శకుల్లో ఆ ప్రాంతంపై మరింత అవగాహన పెంచేలా ఎగ్జిబిషన్‌ల వంటివి ఏర్పా టుచేయనున్నారు. 'అత్యంత అరుదైన మూలకాల కోసం ఖనిజాల తవ్వకం కోసం తమిళనాడులో రేర్ ఎర్త్ కారిడార్‌ను ఏర్పాటుచేయబోతున్నాం. ఖనిజాల శుద్ధి, పరిశోధన, తయారీని మరింతగా ప్రోత్సహిస్తాం' అని మంత్రి నిర్మల అన్నారు.





## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




# 6 వేల మీటర్ల లోతులో జపాన్ ఘనత


జపాన్ సముద్రగర్భ అన్వేషణలో అద్భుతమైన మైలురాయిని అధిగమించి ప్రపంచ రికార్డును సాధించింది. పరిశోధకుల బృందం 6,000 మీటర్ల లోతునుండి 'రేర్ ఎర్త్' మూలకాలను కలిగి ఉన్న అవక్షేపాలను విజయవంతంగా వెలికితీసింది. నీటి అడుగున ఖనిజ సేకరణలో ఇది ఒక రికార్డు. ఈ కీలకమైన ఖనిజాల వెలికితీత కొత్త శక్తి సాంకేతికతలు. ఆర్థిక భద్రతకు మార్గం సుగమం చేస్తాయి, విదేశీ సరఫరాదారులపై జపాన్ ఆధారపడటాన్ని తగ్గిస్తాయిని నిపుణులు భావిస్తున్నారు. ఖనిజాల వేటలో సముద్ర మట్టానికి సుమారు 6,000 మీటర్ల లోతులో ఖనిజాలను సేకరించడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి పసిఫిక్ మహా సముద్రంలోని మారుమూల ద్వీపమైన మినామి టోరిషిమా సమీపంలో ఈ తవ్వకాలు జరిగాయి. ఈ ప్రయోగం కోసం 'చిమ్యు' అనే అత్యాధునిక డ్రిల్లింగ్ నౌకను శాస్త్రవేత్తలు ఉపయోగించారు. ఇంతటి లోతులో ఖనిజాలను సేకరించే ఆపరేషన్నిర్వహించడం ప్రపంచంలోనే తొలిసారి అని అధికారులు వెల్లడించారు.

**ప్రపంచంలోనే తొలి విజయం**

ప్రపంచ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డు అని అధికారులు ప్రకటించారు. జపాన్ ఆర్థిక, వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ, జపాన్ ఏజెన్సీ ఫర్ మెరైన్‌ఎర్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టింది. అధునాతన డీప్‌సీ డ్రిల్లింగ్ నౌక చిక్యూను ఉపయోగించి, బృందం మారుమూల పసిఫిక్ ద్వీపమైన మినామి టోరిషిమా సమీపంలో ఈ మిషన్‌ను నిర్వహించింది. ఈ పురోగతి కీలకమైన ఖనిజాలలో స్వావలంబన వైపు ఒక అడుగు అని అధికారులు అంటున్నారు. ఇతర దేశాలు కూడా ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, జపాన్ అత్యధిక లోతులో సరికొత్త రికార్డు నెలకొల్పడం విశేషం.



ఈ రేర్‌ఎర్త్ మూలకాలు అవసరం ప్రస్తుతం ఆధునిక ప్రపంచానికి చాలా వుంది. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు, విండ్ టర్బైన్లు, స్మార్ట్‌ఫోన్‌లు, సైనిక పరికరాలు , ఇతర హైటెక్ పరికరాలలో వీటిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అరుదైన మూలకాల ఉత్పత్తిలో చైనా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ విజయంతో జపాన్ ఇక ఇతర దేశాలపై ఆధారపడే అవసరం ఉండదు.



# పాక్ సైన్యానికి చుక్కలు.. మునీర్‌కు కొత్త టెన్షన్?

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ సైన్యానికి బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకు చెందిన ఇద్దరు మహిళలు చుక్కలు చూపించారు. ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లుగా మారి పాకిస్తాన్ సిబ్బంది దాదాపు 200 మందిని హతమర్చారు. మరోవైపు.. బలోచిస్థాన్ అంతటా పాక్ భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించనున్నట్లు బీఎల్‌ఏ పేర్కొంది. దీంతో, దాయాది పాక్‌కు బీఎల్‌ఏ వెన్నులో వణుకుపుట్టించినట్టు అయ్యింది. ఇంతకీ ఏం జరిగిందంటే.. కొద్దిరోజులుగా దాయాది దేశం పాకిస్తాన్‌లో వరుస దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బలోచిస్థాన్ ప్రావిన్సులో ఉన్న 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు తమదే బాధ్యత అని తాజాగా బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (BLA) ఓ ప్రకటనలో తెలిపింది. ఇదే సమయంలో పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా వంద మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ హవా బలోచ్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. ఇక, ఇద్దరు మహిళలు దాడులు చేసిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ఇదిలా ఉండగా.. బీఎల్‌ఏ విడుదల చేసిన వీడియోలో ఆత్మాహుతి దాడిలో పాల్గొన్న మహిళా యోధురాలు పాక్ ప్రభుత్వాన్ని ఎగతాళి చేస్తూనే.. సంచలన ఆరోపణలకు దిగింది. బలూచ్ యోధుల్ని ఏమీ చేయలేక.. తమ ఇంట ఆడవాళ్లపై ప్రతాపం చూపిస్తోందని పేర్కొంది. "పాక్ సైన్యానికి మమ్మల్ని నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేదు. అది వాళ్ల కెపాసిటీకి మించిన పని. అందుకే మా ఇంట ఆడవాళ్లపై పడ్డారు. ఇది పిరికిపంద చర్య కాదంటారా?" అంటూ ఆ వీడియోలో మాట్లాడింది. అలాగే బలోచ్ ప్రజలు మేల్కొని పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. మాకు ఇంతకు మించిన మార్గం మరొకటి లేదంటూ పెద్ద తుపాకీ పట్టుకొని చిరునవ్వుతో చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట తెగ వైరల్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలు చేసిన 12 గంటల్లోపే ఆమె వీరమరణం పొందిందని బీఎల్‌ఏ పేర్కొంది.

మీడియా నివేదికల ప్రకారం.. ఆత్మాహుతి చేసుకున్న బలూచ్ యోధురాలు హవా బలోచ్‌కు సంబంధించిన కొన్ని విషయాలు బయటకు వచ్చాయి. ఆమె తండ్రి 2021లో పాకిస్తాన్ భద్రతా దళాల చేతిలో మరణించినట్టు తెలిసింది. అతడు బీఎల్‌ఏ యోధుడని సమాచారం. సదరు మహిళ తిరుగుబాటులో చేరడానికి ముందు అధికారికంగా విద్యను కూడా పొందినట్టు నివేదించబడింది. ఇది దశాబ్దాలుగా కొనసాగుతున్న బలోచ్ వేర్పాటువాద ఉద్యమం ధోరణిని ప్రతిబింబిస్తుంది.

**పాక్ ఓవరాక్షన్..**

పాకిస్తాన్‌లో అతిపెద్ద ప్రావిన్స్ బెలూచిస్తాన్ (సుమారు 44% భూభాగం). అయితే.. పంజాబీలు, పష్తూన్లు వంటి జాతులు పాక్ రాజకీయ, సైనిక, ఆర్థిక వ్యవస్థలో ప్రధాన ఆధిపత్యం కలిగి ఉన్నారు. ఈ క్రమంలో కేవలం ఆరు శాతం జనాభా ఉన్న మైనారిటీ వర్గం బలూచ్.. సొంత గడ్డపై అన్నివిధాలుగా తీవ్ర అణచివేతకు గురవుతోంది. అదే సమయంలో గ్యాస్, ఖనిజ ఆర్థిక వనరులతో పాటు గ్వాదర్ పోర్ట్ విషయంలోనూ పాక్ ప్రభుత్వ పెత్తనం ఎక్కువైందని.. స్థానికులైన తమకు తగిన లాభాలు అందడం లేదంటూ ఆ జాతి వాదిస్తోంది. వెరసి తమ హక్కుల కోసం తిరుగుబాట్లు, ఉద్యమాలు చేస్తున్నారు.

# మోదీకి ట్రంప్ ఫోన్..


## ఇండియా గేట్ అత్యద్భుతం



భారత్‌లో ఉన్న ఇండియా గేట్‌పై ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కట్టడం అత్యద్భుతమని పేర్కొంటూ తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ఈ కట్టడం గ్రేటేస్ట్ ఆఫ్ ఆల్ అన్నారు. ఇటువంటి కట్టడాన్ని అమెరికా వాషింగ్టన్ డీసీలో నిర్మించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొద్దిసేపటి క్రితమే మోదీతో ఫోన్‌లో మాట్లాడారని స్టేటూన్ అంటూ అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

# హిజ్బుల్లా స్థావరాలపై ఐడీఎఫ్ దాడులు

ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ తాజాగా దక్షిణ లెబనాన్‌లోని హెజ్బుల్లా ఆయుధ నిల్వ కేంద్రాలపై దాడులు జరిపింది.ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ, హెజ్బుల్లా ఉగ్రవాద సంస్థ తన కార్యకలాపాలను మళ్లీ పుంజుకునేలా చేస్తోందన్న సమాచారంతో ఇజ్రాయెల్ సైన్యం ఈ దాడులు నిర్వహించింది. హిజ్బుల్లా కార్యకర్తలు ఇజ్రాయెల్ భూభాగం వైపు ట్యాంక్ వ్యతిరేక క్షిపణులను ప్రయోగించడానికి ఉపయోగించిన అల్‌ఖియామ్ సమీపంలోని ఒక నిర్మాణాన్ని కూడా సైనికులు కూల్చివేసినట్లు సైన్యం తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాల్లో హిజ్బుల్లా చెందిన ఆయుధ నిల్వ గిడ్డంగులను లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేసింది. ఈ దాడులకు ముందు, పౌరులకు ఎలాంటి హాని కలగకుండా రక్షణ చర్యలు తీసుకున్నారు, వాటిలో ఆ ప్రాంతంలోని జనాభాకు ముందస్తు ఇజ్రాయెల్ సైన్యం ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.ఈ ఆయుధ కేంద్రాలలో ఒకటి జనసంచారం ఎక్కువగా ఉండే నివాస ప్రాంతాల మధ్యలో ఉంది. లెబనాన్ పౌరులను హిజ్బుల్లా 'మానవ కవచాలు' వాడు కుంటోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. పౌర మౌలిక సదుపాయాల నుండి కార్యకలాపాలను కొనసాగిస్తోంది అనడానికి ఇదొక ఉదారణ అని పేర్కొంది. ఈ ఆయుధ కేంద్రాలు ఇజ్రాయెల్ దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తాయని, అందుకే



వాటిని తొలగించడం తప్పనిసరి అని IDF స్పష్టం చేసింది. కాగా ఈ దాడులు కేవలం ఆకస్మికమైనవి కావు, దీని వెనుక కీలకమైన కారణాలు లేకపోలేదు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం, దక్షిణ లెబనాన్ సరిహద్దు ప్రాంతాల్లో హిజ్బుల్లా ఎటువంటి సైనిక కార్యకలాపాలు నిర్వహించ కూడదు. కానీ హిజ్బుల్లా మళ్లీ అక్కడ స్థావరాలను నిర్మించడానికి ప్రయత్నిస్తోందని ఇజ్రాయెల్ చెబుతోంది. ఇజ్రాయెల్ సైన్యం ప్రకటన ప్రకారం, తమ దేశానికి ముప్పు పొంచి ఉన్నంత కాలం లెబనాన్‌లోని ఏ ప్రాంతంలోనైనా కార్యకలాపాలు కొనసాగిస్తామని స్పష్టం చేసింది. హెజ్బుల్లా తన సైనిక మౌలిక సదుపాయాలను పౌర గృహాల కింద, స్కూళ్ల సమీపంలో నిర్మించడం అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించడమేనని ఇజ్రాయెల్ విమర్శించింది. ఈ ప్రాంతంలో యుద్ధ మేఘాలు మళ్లీ కమ్ముకుంటున్న నేపథ్యంలో, అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది.



# చలో జార్జియా....

హీరో మహేశ్‌బాబు జార్జియా వెళ్లనున్నారట. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో రూపొందుతున్న చిత్రం 'వారణాసి'. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్‌రాజ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్‌బాబు– ప్రియాంకా చోప్రా పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కాగా, 'వారణాసి' సినిమా నెక్ట్స్ షెడ్యూల్ జార్జియాలో మొదలు కానుందని సమాచారం. అక్కడ షూటింగ్ చేసేందుకు సంబంధించిన కార్యాచరణను ఆల్రెడీ ప్రారంభించారట రాజమౌళి. అలాగే ఓ కీలక షెడ్యూల్‌ను అంటార్కిటికాలోనూ ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఒకవేళ అంటార్కిటికా లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిగితే, అక్కడి క్లిష్టమైన లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుకునే తొలి భారతీయ చిత్రంగా 'వారణాసి' సినిమా నిలుస్తుందనే ప్రచారం జరుగుతోంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్న ఈ సినిమా 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది.




# జీవీకి జోడీగా అనస్వర..

మలయాళంలో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న అనస్వర రాజన్.. ఈ మధ్యే 'ఛాంపియన్' అనే మూవీతో టాలీవుడ్‌కి పరిచయమైంది. ప్రస్తుతం మరో తెలుగు చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇవి అలా ఉండగానే ఓటీటీ లోకి కూడా ఎంట్రీ ఇచ్చేసింది. ఈమె నటించిన ఓ ఫీల్ గుడ్ సిరీస్ ఇప్పుడు స్ట్రీమింగ్‌కి రెడీ అయిపోయింది. ఇంతకీ దాని సంగతేంటి? ఎందులోకి రానుంది? తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్.. ఓవైపు కంపోజ ర్‌గా చేస్తూనే మరోవైపు హీరోగానూ అప్పుడప్పుడు సినిమాలు చేస్తున్నాడు. ఇతడు అనస్వర హీరోహీరోయిన్లుగా చేసిన ఓ సిరీస్ 'లక్కీ'. ఇందులో ఓ కుక్క పిల్ల కూడా లీడ్ రోల్ చేసింది. దీని చుట్టూనే సిరీస్ అంతా ఉంటుంది. హాట్‌స్టార్‌లో ఈనెల 20వ తేదీ నుంచి ఇది.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. 'లక్కీ' విషయానికొస్తే.. తప్పి పోయిన ఓ చిన్న కుక్కపిల్ల హీరోకి దొరు కుతుంది. దీంతో దాన్ని తీసుకొచ్చి తన ఇంట్లోనే ఉంటున్న పాపకు ఇస్తాడు. ఓ రోజు.. రాజకీయ నాయకుడు సదరు పెట్ డాగ్‌ని ఎత్తుకుపోతాడు. అసలు ఆ కుక్కపిల్ల సంగతేంటి? చివరకు హీరోకు దగ్గరకు చేరిందా లేదా అనేది స్టోరీలా అనిపిస్తుంది.



# ఆ కారణం వల్లే బాయ్‌ఫ్రెండ్‌తో బ్రేకప్

సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఇటీవల ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. సినిమాల కంటే పర్సనల్ లైఫ్‌పై రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. కోలీవుడ్ స్టార్ ధనుశ్‌ను ఆమె పెళ్లాడనుందని వార్తలొచ్చాయి. వీటిపై తాజాగా ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది. ధనుశ్ తనకు మంచి ఫ్రెండ్ మాత్రమే కాదు.. ఒక అన్నలాంటి వాడని చెప్పకొచ్చింది. ఆమె నటించిన దో దివానే శహర్ మే అనే మూవీ ప్రమోషన్స్‌లో పాల్గొన్న మృణాల్ ఠాకూర్ ఈ విషయంపై స్పందించింది. అంతేకాకుండా తన బాయ్ ఫ్రెండ్‌తో బ్రేకప్ గురించి మృణాల్ చెప్పేసింది. నేను యాక్టింగ్ చేయడం అతనికి నచ్చలేదని.. మేము విడిపోవడానికి అదే కారణమని తెలిపింది. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని అతనే బ్రేకప్ చెప్పేశాడని వెల్లడించింది. ఈ విషయంలో తనకు ఎలాంటి బాధ లేదని.. అలాంటి వాడితో కొనసాగడం కష్టంగా అనిపించిందని పేర్కొంది. అందుకే అతనితో విడిపోవాల్సి వచ్చిందని మృణాల్ చెప్పకొచ్చింది. బ్రేకప్ తర్వాత అతని గురించి జాలిపడ్డానని తెలిపింది. కాగా.. మృణాల్ హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం దో దివానే శహర్ మే. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలోకి రానుంది. అంతే కాకుండా టాలీవుడ్ హీరో అడివి శేష్ సరసన డకాయిట్‌లో మృణాల్ నటిస్తోంది. ఈ సినిమా మార్చి 19న రిలీజ్ కానుంది.



# దసరాకి కింగ్

హీరో నాగార్జున ఒక స్పెషల్ మూవీ చేస్తు న్నారు. మరి... కెరీర్‌లో నూరవ చిత్రం అంటే ప్రత్యేకమే కదా. అందుకే దసరా పండగకి సందడి చేయాలని నిర్ణయించుకున్నట్లున్నారు. అభిమానులు కూడా తమ కింగ్ (నాగార్జునని అలానే పిలుస్తారు) సెంచరీ సినిమా కోసం ఆస క్తిగా ఎదురు చూస్తున్నారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూ పొందుతోంది. తమిళ చిత్రం 'నిదమ్ ఒరు వానమ్'తో దర్శకు డిగా పరిచయమైన ఆర్ఏ కార్తీక్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూ పొందిస్తున్నారని సమాచారం. లాటరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని భోగట్టా. అందుకే 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ని అనుకుంటున్నారట. ఇంకా 'కింగ్ 100, కింగ్ 100 నాటౌట్' టైటిల్స్‌ని కూడా పరిశీలిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో టబు నటిస్తున్నారు. టబు ఎంట్రీని అధికారికంగా ప్రకటించారు. అలాగే అనుష్క కూడా ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. అయితే ఈ విషయంపై ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నాగార్జున నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా విడుదల చేయాలనుకుంటున్నారనే వార్త తెరపైకి వచ్చింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com